ప్రజాశక్తి

శనివారం 20 డిసెంబర్ 2025 8 పేజీలు



గుంటూరు



పల్నాడు





గుంటూరులోని కొరిటపాడు సెంటర్లో, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహాల ఎదుట నిరసన..

పేదలపై మోడీ ప్రభుత్వం దాడి

ఉపాధి హామీ చట్టసవరణపై సిపిఎం నిరసన - ప్రజా సంఘాల సంఘీభావం

ప్రజాశక్తి-గుంటూరు, పల్నాడు జిల్లా

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని సవరించటం వల్ల గ్రామీణ పేదల ప్రజల ఉపాధికి గండిపడుతుందని, బిజెపి ప్రభుత్వం పేదలపై దాడి చేస్తుందని వక్తలు అన్నారు. ఉపాధి హామీ చట్ట సవరణను వ్యతిరేకిస్తూ గుంటూరు కొరిటపాడు సెంటర్‌లో గాంధీజి విగ్రహం వద్ద, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేటలోని మున్సిపల్ కార్యాలయం వద్ద గాంధీ విగ్రహం ఎదుట కళ్లకు గంతలతో సిపిఎం ఆధ్వర్యంలో శుక్రవారం నిరసనలు చేపట్టారు. నిరసన కార్యక్రమం నిర్వహించారు. గుంటూరు సిపిఎం నగర కమిటీ ఆధ్వర్యంలో నిరసరకు మాజీ ఎమ్మెల్సీ కెఎస్ లక్ష్మణరావు, జనచైతన్య వేదిక అధ్యక్షులు వి.లక్ష్మణరెడ్డి, అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి, సిఐటియు, పలు ఉద్యోగ సంఘాల నాయకులు పాల్గొని సంఘీభావం తెలిపారు. నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.మత్యాలరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కెఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో వామపక్షాల చొరవతో ఉపాధి హామీ చట్టం వచ్చిందని, రెండు దశాబ్దాల కాలంలో గ్రామీణ పేదలకు ఎంతగానో ఉపయోగపడిందన్నారు. అటువంటి చట్టాన్ని నీరుగార్చటానికి బిజెపి ప్రభుత్వం పథకంగా మార్చిందన్నారు. గతంలో 90 శాతం నిధులు కేంద్రం భరించేదని, ఇప్పుడు 60 శాతానికి కుదించిందని, మిగిలినది రాష్ట్రాలు భరించాలని చట్ట సవరణ చేశారన్నారు. దీని వల్ల రాష్ట్రాలపై భారం పెరిగి అమలు నిలిచే ప్రమాదం ఉందన్నారు. స్వాతంత్ర్య ఉద్యమంలో కీలకమైన నాయకుడు, జాతిపిత పేరు మార్చటం దుర్మార్గం అని, ఇదేనా బిజెపి దేశభక్తి అని ప్రశ్నించారు. సిపిఎం నగర కార్యదర్శి కె.నళినీకాంత్ మాట్లాడుతూ చట్టానికి గ్యారంటీ ఉంటుందని, పథకానికి ఉండదన్నారు. పట్టణాలకూ సైతం ఉపాధి హామీని విస్తరించాలని డిమాండ్ వస్తున్న నేపథ్యంలో మొత్తంగా నీరుగార్చేందుకు కుట్రలు చేస్తుందన్నారు. సంవత్సరంలో వంద రోజుల పనిగ్యారంటీతో ఈ చట్టాన్ని తెచ్చారని, పని ఇవ్వకపోతే భృతి ఇవ్వాలని, పథకంగా మార్చటం వల్ల పనికి గ్యారంటీ లేదన్నారు. వి.లక్ష్మణరెడ్డి మాట్లాడుతూ రాష్ట్రాలు, స్థానిక సంస్థల హక్కులను కేంద్రం హరిస్తుందన్నారు. ఉపాధి చట్టం ప్రకారం గ్రామ సభలు తీర్మానం చేసి, పేదలకు పని కల్పించాయని, ఇప్పుడు కేంద్రం నిధులు ఇస్తేనే పని ఉంటుందన్నారు. రెండు దశాబ్దాలుగా పేదలకు ఉపాధితోపాటు, గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ఉపాధి హామీ చట్టం దోహదం చేసిందని, అటువంటి చట్టాన్ని నీరుగార్చటం సరికాదన్నారు. అవగాహన కార్యదర్శి కొండా శివరామిరెడ్డి మాట్లాడుతూ పేదలకు వ్యవసాయ పనులు లేని రోజుల్లో ఉపాధి కల్పిస్తున్న చట్టానికి సవరణలు చేయటం సరికాదన్నారు. మధ్య తరగతి ఉద్యోగుల ▶ 2లో

పొదుపు సంఘాల
రుణాల్లో గోల్‌మాల్

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

మెప్మా సంస్థ ద్వారా మంజూరైన రుణాల్లో పెద్ద ఎత్తున అవినీతి అక్రమాలు జరిగినట్టు తెలిసింది. రుణాల మంజూరులో జరిగిన అక్రమాలకు సంబంధించి గుంటూరులో సస్పెండ్ అయిన ఒక మహిళా ఉద్యోగినికి నరసరావుపేట మునిసిపాలిటీలో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా నియమించడంలో టిడిపి నాయకులు కీలక భూమిక పోషించారు. దీంతో ఆమె నర్సరావుపేట పట్టణంలో కూడా స్వయం సహాయక సంఘాలకు రుణాల మంజూరులో తనవాటం ప్రదర్శించినట్టు తెలిసింది. సిటీమిషన్ పేరుతో మేనేజరుగా పనిచేసిన మరో మహిళా ఉద్యోగి కూడా నకిలీ స్వయం సహాయక సంఘాలను సృష్టించి బ్యాంకుల నుంచి మహిళల పేరున అక్రమంగా రుణాలు తీసుకుంటున్నట్టు తెలిసింది. గుంటూరుకు సమీపంలోని నల్లపాడులో పెద్ద ఎత్తున అక్రమాలకు పాల్పడిన మహిళా అధికారినే నరసరావుపేటలో నియమించినట్టు ఆరోపణలు వస్తున్నాయి.

మొత్తం 140 గ్రూపులకు సంబంధించి రూ.25 కోట్ల వరకు అక్రమంగా రుణాలు తీసుకున్నారని తెలిసింది. అసలు ▶ 2లో

'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు - రాష్ట్ర ప్రభుత్వ విధానాలు'పై నేడు స్మారకోపన్యాసం

ప్రజాశక్తి - విజయవాడ

స్వాతంత్ర్య సమరయోధులు, మార్క్సిస్టు సిద్ధాంతకర్త మాకినేని బసవపున్నయ్య 111వ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం 5.30 గంటలకు 'ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామికీకరణ తీరుతెన్నులు - రాష్ట్ర ప్రభుత్వ విధానాలు' అనే అంశంపై స్మారకోపన్యాసం ఏర్పాటు చేసినట్లు ఎంబి విజ్ఞాన కేంద్రం ఒక ప్రకటనలో తెలిపింది. విజయవాడలోని ఎంబి విజ్ఞాన కేంద్రం చుక్కపల్లి పిచ్చయ్య ఆడిటోరియంలో జరిగే ఈ కార్యక్రమంలో సుందరయ్య విజ్ఞాన కేంద్రం చైర్మన్ బి.వి.రాఘవులు ఉపన్యసిస్తారు. ఎంబివికె ట్రస్ట్ చైర్మన్ పి.మధు అధ్యక్షత వహిస్తారు.



సమావేశంలో మాట్లాడుతున్న గ్రామస్తులు

కొంచం ఇష్టం.. కొంచం కష్టం..

మందడంలో ఎన్8 రోడ్డు బాధితుల సమావేశంలో భిన్నాభిప్రాయాలు

ప్రజాశక్తి - తుళ్లూరు


'రాజధాని అభివృద్ధిలో భాగంగా రోడ్ల నిర్మాణానికి ఇళ్లు ఇవ్వడం తప్పనిసరి అయినందున కొంత ఇష్టంగా ఉన్నా ఊళ్లో గుడులను తొలగిస్తామంటే చాలా కష్టంగా ఉంది' అని మందడం గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇళ్లు పోయినా ఫర్వాలేదు.. గుడులు మాత్రం పోవడం ఎట్టిపరిస్థితుల్లోనూ అంగీకరించేది లేదని తేల్చిచెప్పారు. రాజధాని అమరావతిలోని మందడంలో ఎన్ 8 రోడ్డు నిర్మాణంలో ఇళ్లు కోల్పోయే వారితో సిఆర్‌డిఎ అధికారులు, ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ శుక్రవారం సమావేశమయ్యారు. సిఆర్‌డిఎ కాంపిటెంట్ అథారిటీ కార్యాలయం వద్ద జరిగిన సమావేశంలో రోడ్డు నిర్మాణం కారణంగా ఇల్లు కోల్పోయే వారికి ప్రభుత్వం ఇచ్చే నష్ట పరిహారం, ప్రత్యామ్నాయ స్థలాల కేటాయింపు తదితర అంశాలను అధికారులు వివరించారు. రోడ్డు పాత అలైన్‌మెంట్ ప్రకారం 98 ఇళ్లను తొలగించాల్సి రాగా కొత్త అలైన్ మెంట్ ప్రకారం 148 ఇళ్లు తొలగించాల్సిన జాబితాలో చేరాయన్నారు. 20 ఏళ్ల క్రితం నిర్మించిన ఇళ్లకు ఇప్పటి మార్కెట్ విలువ కట్టి పరిహారం చెల్లిస్తామని, ఖాళీ స్థలాలకు బదులుగా అంతే విస్తీర్ణంలో స్థలాలు కేటాయిస్తామని ▶ 2లో

వణికిస్తున్న పొగ మంచు

- పెరిగిన చలిగాలులు
- రాత్రి 9 గంటలకే చల్లదనం
- మరో మూడ్రోజులు తీవ్రంగానే చలి



గుంటూరులో ఉదయం వేళ మంచు



బృందావన్ గార్డెన్స్ రోడ్డులో మంచుతో తగ్గిన వాహనాలరద్దీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరు, పల్నాడు జిల్లాల్లో పొగమంచు వణికిస్తోంది. వారం రోజులుగా చలిగాలుల తీవ్రత పెరిగింది. రాత్రి 9 గంటలకే చలి తీవ్రత ప్రారంభం అవుతోంది. ఫ్యాన్ల గాలికి కూడా మరింత చల్లదనం వస్తోంది. విద్యుత్ వినియోగం గణనీయంగా తగ్గింది. జిల్లాలో సగటున రోజుకు 20 మిలీయన్ యూనిట్లు వినియోగిస్తారని అంచనా ఉంది. చలి తీవ్రత వల్ల రోజుకు రెండు లక్షల మిలియన్ యూనిట్ల వినియోగం తగ్గినట్టు అంచనా వేస్తున్నారు. ఎసిల వినియోగం బాగా తగ్గించారు.

మరోవైపు చలి గాలుల తీవ్రత ఒక వైపు పెరుగుతుండగా మరో వైపు దోమల బెడద కూడా ఎక్కువగానే ఉంటోంది. పగటి ఉష్ణోగ్రతలు గణనీయంగా తగ్గాయి. రాత్రి జిల్లాల్లో 18 నుంచి 20 డిగ్రీల లోపు ఉంటోంది. గత వారం రోజుల్లో ఐదు నుంచి ఆరు డిగ్రీల ఉష్ణోగ్రతలు తగ్గాయి. గతవారం రాత్రి వేళ 25 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు ఉండేవి. పగటి ఉష్ణోగ్రతలు కూడా బాగా తగ్గుముఖం పట్టాయి. పగటి ఉష్ణోగ్రతలు గరిష్టంగా 25 నుంచి 28 డిగ్రీలు మాత్రమే నమోదు అవుతోంది. వేకువజామున 4 గంటలనుంచి ఉదయం 8 గంటల వరకు విపరీతంగా మంచుకురుస్తోంది. రోడ్లపై వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారింది. ఉదయం8 గంటల వరకు జనసంచారం కన్పించడంలేదు. దూరం నుంచి వస్తున్న వాహనాలు దగ్గరగా వచ్చే వరకు కన్పించడం లేదని డ్రైవర్లు చెబుతున్నారు. కొంత మంది డ్రైవర్లు ముందు జాగ్రత్తగా వాహనాలను ఉదయం 5 గంటల నుంచి 8 గంటల వరకు రోడ్డుపక్కన నిలిపివేస్తున్నారు. ఉదయం 8 గంటల తరువాత ఎండ వస్తోంది. వేకువజామున ఇతర ప్రాంతాలకు వెళ్లేందుకు రైల్వే స్టేషన్లు, బస్టాండ్లలకు వెళ్లే వారు పలు సమస్యలు ఎదుర్కొంటున్నారు. పొగ మంచు వల్ల వాహనదారులు, పాదాచారులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయాన్నే పాఠశాలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు, వ్యవసాయ పనులకు వెళ్లే కూలీలు, వివిధ ప్రాంతాలకు రోజు వారి పనులకు వెళ్లే భవన నిర్మాణ కార్మికులు చలి తీవ్రతకు ఇబ్బంది పడుతున్నారు.

వివిధ స్టేడియంలలో ఉదయం పూట వాకింగ్ వెళ్లే వారు చాలా మంది చలి తీవ్రతకు భయపడి కొద్ది రోజులు వాకింగ్, జాకింగ్, యోగాకు విశ్రాంతి కల్పిస్తున్నారు. చలి తీవ్రత వల్ల ప్రజలకు వివిధ రకాల వైరస్‌లు వ్యాప్తి చెందుతున్నాయి. నుమోనియా సమస్యలున్న వారు తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. జలుబు, దగ్గు, జ్వరాలు వస్తున్నాయి. కొంత మంది ఆస్మా వ్యాధి గ్రస్తులు బాగా ఇబ్బంది పడుతన్నారు. సైన సైటిస్, ఊపిరితుత్తుల సమస్య ఉన్న వారికి బ్రీతింగ్ సమస్యలు ఏర్పడుతున్నాయి.చలిగాలుల వల్ల శ్వాసనాళాలు కుచించుకుపోయి శ్వాస తీసుకోవడం కష్టం అవుతుందని వైద్యులు చెబుతున్నారు. చలి తీవ్రతతో గుంటూరులోని పలు స్విమ్మింగ్ కేంద్రాలను మూసివేశారు. చలి తీవ్రత, గాలులు మరో మూడు రోజులు తీవ్రంగానే ఉంటాయని వాతావరణ శాఖ అధికారులు ప్రకటించారు.



స్వచ్ఛ పరికరాలు పంపిణీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

స్వచ్ఛ ఆర్టీసీ కార్యక్రమంలో భాగంగా ఆర్టీసీ ఔట్సోర్సింగ్ వర్కర్స్, హమాలీలకు స్వచ్ఛ పరికరాలను జోనల్ చైర్మన్ ఎస్.సురేష్ రెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్రంలో మహిళలకు ఉచిత బస్సు పథకం సూపర్ సక్సెస్ అయ్యిందన్నారు. దీంతో బస్సుల్లో పరిశుభ్రత పెంచే దిశగా ప్రభుత్వం స్వచ్ఛ ఆర్టీసీ కార్యక్రమం చేపట్టిందన్నారు. సిబ్బంది, కార్మికులకు కావాల్సిన స్వచ్ఛ పరికరాలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. నెల్లూరు జిల్లాలో ఈ కార్యక్రమం ఇటీవల పూర్తయిందని, గుంటూరులో ప్రారంభించామని తెలిపారు. స్వచ్ఛ ఆర్టీసీ కార్యక్రమం కోసం పని చేసే సిబ్బందికి ప్రత్యేక వస్త్రాలు, డస్టుబిన్‌లు, స్వెట్టర్లు, దుప్పట్లు అందచేశారు. ఆర్‌టిసి రీజనల్ మేనేజరు డి.సామ్రాజ్యం, డిపో మేనేజర్లు రామకృష్ణ, సునీత పాల్గొన్నారు.

పట్టణంలో పలుచోట్ల విద్యుత్ కోత

ప్రజాశక్తి-తెనాలిరూరల్

పట్టణ పరిధి సుల్తానాబాద్ ప్రాంతంలో ఫీడర్ లైన్ల మరమ్మత్తులు కారణంగా పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనున్నట్లు ఎపిసిపిడిసిఎల్ ఆపరేషన్ సబ్ డివిజన్ డిఈ బోరుగడ్డ అశోక్ కుమార్ శుక్రవారం ప్రకటనలో తెలిపారు. సుల్తానాబాద్, ఆలపాటి నగర్, సరళ నగర్, జెఎంజె కాలేజి, సుగాలి కాలనీ ప్రాంతాల్లో ఉదయం 10:00 నుండి మధ్యాహ్నం 02:00 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు. చెంచుపేట స్టేడియం 11 కెవి ఫీడర్ లైన్ల మరమ్మతులు కారణంగా ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డు, స్టేడియం వెనుక ప్రాంతం, కుమార్ కాలనీ, ఇందిరానగర్ ప్రాంతాల్లో మధ్యాహ్నం 02:00 గంటల నుండి సాయంత్రం 05:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు తెలిపారు. వినియోగదారులు గమనించి ప్రభుత్వ అధికారులకు సహకరించాలని కోరారు.

డిజిపి నుంచి అవార్డు అందుకున్న రూరల్ సీఐ

ప్రజాశక్తి - తెనాలి

అత్యంత ప్రతిష్టాత్మకమైన ఎబిసిడి పురస్కారాన్ని రూరల్ సీఐ నయాబ్ రసూల్ రాష్ట్ర డిజిపి హరీష్ గుప్తా నుంచి అందుకున్నారు. సిఐ వెల్లడించిన వివరాల ప్రకారం బాపట్ల రూరల్ పోలీస్ స్టేషన్ పరిధిలో ప్రముఖ పర్యాటక ప్రాంతమైన సూర్యలంక హరిత రిసార్ట్ వెబ్ సైట్ ను, పోలిన ఫేక్ వెబ్ సైట్లు ఉపయోగించి ప్రజలను మోసం చేస్తున్న గ్యాంగ్ ను గుర్తించగా, దానికి సాంకేతిక పరిజ్ఞానాన్ని అప్పటి బాపట్ల జిల్లా ఐటీ కోర్ ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న షేక్ నాయబ్ రసూల్ అందించారు. దాని ఆధారంగా అప్పటి బాపట్ల పోలీస్ బృందం రాజస్థాన్ రాష్ట్రంలో సహస్ర గ్రామంలో జాయిన్ అనే వ్యక్తిని పట్టుకొని నకిలీ వెబ్సైట్లు తయారు చేసే వ్యక్తులని అరెస్ట్ చేశారు. ఆ ఫేక్ వెబ్సైట్లు తిరుమల దేవస్థానము, శ్రీశైలం దేవస్థానాల పేరుతో కూడా నకిలీ వెబ్ సైట్ లను తయారు చేశారు. అదేవిధంగా ఆ ముఠా పై దేశ వ్యాప్తంగా 127 ఫిర్యాదులు ఉన్నట్లు గుర్తించారు. ఈ కేసును చేధించడంలో అదుతే ప్రతిభ కనబరిచినందుకు గాను బాపట్ల జిల్లా ఎస్పీ బి.ఉమామహేశ్వర్ తో పాటు అప్పటి బాపట్ల పోలీస్ బ ందంతో కలిసి నయబ్ రసూల్ కు ఏబిసిడి అవార్డు (అవార్డు ఫర్ బెస్ట్ ఇన్ క్రైమ్ డిటెక్షన్) ఏపీ డీజీపీ హరీష్ కుమార్ గుప్తా చేతుల మీదుగా శుక్రవారం అందుకున్నట్లు వెల్లడించారు. ఈ సందర్రేగా గుంటూరు రేంజ్ ఐజి సర్వ శ్రేష్ట త్రిపాటి ప్రత్యేకంగా అభినందించి, సిఐ నాయబ్ రసూల్ కు ఉన్న సాంకేతికత పరిజ్ఞానంపై నైపుణ్యతను డిజిపికి వివరించినట్లు సీఐ తెలిపారు. ఏబిసిడి పురస్కారం అందుకున్న సిఐను సిబ్బంది అభినందించారు.

గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు అరెస్టు

1.20 కిలోల సరుకు స్వాధీనం

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గంజాయి రవాణా, విక్రయం కేసులో ఐదుగుర్ని అరెస్టు చేసినట్టు పశ్చిమ డిఎస్‌పి కె.అరవింద్ తెలిపారు. అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పోలీస్ అధికారులు సిబ్బంది అరండల్ పేట పోలీస్ స్టేషన్ పరిధిలో గంజాయి కార్యకలాపాలు జరగకుండా ప్రత్యేక నిఘా ఏర్పాటు చేశారని తెలిపారు. నిందితులు హర్ష సాయి అనే వ్యక్తి వద్ద నుండి గంజాయి కొనుగోలు చేసి అధిక లాభానికి అమ్ముకోవాలని నిర్ణయించుకున్నారన్నారు. ముందుగా రూ.3 వేలకు కిలోన్నర గంజాయిని కొనుగోలు చేసి అమ్ముకున్నారని, మలి విడత మరో రూ.3 వేలకు కిలో 200 గ్రాములు గంజాయిని తీసుకువచ్చి బ్రాడిపేట ఒకటవ లైను వద్ద పంచుకుంటుండగా పోలీసులకు పట్టుకున్నారని చెప్పారు. అరెస్టు అయిన వారిలో గుంటూరు సంజీవయ్య నగర్‌కు చెందిన మందా సుదీర్, గుమ్మా సాయి కుమార్ (అడవితక్కెళ్లపాడు), షేక్ బాజీ (నల్లచెరువు), షేక్



ఈశుబ్, (నెహ్రూ నగర్), కుంచం గోపిచంద్(బ్రాడిపేట)ను అరెస్టు చేసినట్టు డిఎస్‌పి తెలిపారు. అరండల్‌పేట సిఐ ఆరోగ్యరాజు, ఎస్ఐ బాజీబాబు పాల్గొన్నారు.

పేదలపై మోడీ ప్రభుత్వం దాడి

(మొదటి పేజీ తరువాయి)

సంఘం నాయకులు వివికె.సురేష్ మాట్లాడుతూ చట్ట సవరణ అంటే పేదలపై మోడీ ప్రభుత్వం సర్జికల్ స్ట్రైక్ చేస్తుందన్నారు. ఇప్పటిదాకా రైతులు, కార్మికులు, ప్రభుత్వ రంగ సంస్థలపై దాడి చేసిన బిజెపి ఇప్పుడు గ్రామీణ పేదలపై దాడి చేస్తుందన్నారు.ఐద్వా జిల్లా కార్యదర్శి ఎల్.అరుణ మాట్లాడుతూ మహిళలకు ఉపాధి హామీ చట్టం ద్వారా ఉపాధి దొరుకుతుందని, ఇప్పుడు ఉపాధి అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళణ వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సిపిఎం నగర కార్యదర్శివర్గ సభ్యులు బి.సత్యనారాయణ, కె.శ్రీనివాస్, ఖాసింవలి, ఆది నికల్సన్, ఖాసిం షహీద్, జి.వెంకట్రావు, మస్తాన్‌వలి, రాజేశ్వరరావు పాల్గొన్నారు.

నరసరావుపేటలో సిపిఎం నరసరావుపేట మండల కార్యదర్శి డి.శివకుమారి అధ్యక్షతన నిరసనలో పల్నాడు జిల్లా కార్యదర్శి గుంటూరు విజయ్‌కుమార్ మాట్లాడుతూ కొత్త చట్టంలో రూపొందించిన విధానాలు ఉపాధి అవకాశాలు కల్పించడానికి విరుద్ధంగా ఉన్నాయని, ఉన్న ఉపాధిని లేకుండా చేసేలా ఉందని అన్నారు. పని దినాలు 125 రోజులకు పెంచుతున్నట్టు చెప్పి 60 రోజులు పని నిషేధం విధించారన్నారు. ఇప్పటి వరకు 90 శాతం ఉపాధి హామీ పనుల నిధులు కేంద్ర ప్రభుత్వం, రాష్ట్ర ప్రభుత్వం 10 శాతం కాగా చట్టం పేరు మార్పు చేయడంతో పాటు 40 శాతం వాటా రాష్ట్రాలు ఇవ్వాలని చెప్పటం కేంద్ర ప్రభుత్వం ఈ చట్టం ఎత్తివేయాలనే కుట్రలో భాగమన్నారు. పనులను 4 రకాలుగా విభజించి యంత్రాలతో చేసే రూ.కోట్ల పనులను చేర్చి కాంట్రాక్టర్ల ఉపాధి హామీగా మార్చడమేనన్నారు. కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన వేతనాల కంటే రాష్ట్రాల్లో ఎక్కువ వేతనాలు ఉంటే అవే కనీస వేతనాలుగా ఉండాలని ఇప్పుడు ఉన్న దానిని కొత్త బిల్లులో రద్దు చేసి, ద్రవ్యోల్బణం ఆధారంగా వేతనాలు పెరగాలని ఉన్న నిబంధన ఇప్పుడు తొలిగించారని మండిపడ్డారు. సిపిఎం నరసరావుపేట, మండల కార్యదర్శిలు సిలార్ మసూద్, శివ కుమారి,గాంధీ స్మారక సమితి నాయకులు ఈదర గోపిచంద్, సిపిఎం నాయకులు టి.పెద్దిరాజు, కె.నాగేశ్వరరావు తదితరులు మాట్లాడుతూ అనేక పోరాటాలతో సాధించుకున్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తూ కార్మిక, కర్షక వ్యతిరేక చర్యలకు బిజెపి పాల్పడుతుందన్నారు. ఉపాధి హామీ చట్టం రక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేస్తామన్నారు. నాయకులు ఎ.లక్ష్మీశ్వరరెడ్డి, కె.రామారావు, షేక్. మస్తాన్‌వలి, సుభాష్ చంద్రబోస్, కృష్ణ, ప్రేమ్‌సాగర్, జిలానీ మాలిక్ పాల్గొన్నారు.

రుణాల్లో గోల్‌మాల్

(మొదటి పేజీ తరువాయి)

లబ్ధిదారుల స్థానంలో నకిలీ లబ్ధిదారులను ప్రవేశపెట్టారని తెలిసింది. నకిలీ స్వయం సహాయక సంఘాలను సృష్టించి బోగస్ ఆధార్ కార్డులతో అక్రమాలకు పాల్పడ్డారని తెలిసింది. నరసరావుపేట, చిలకలూరిపేట, సత్తెనపల్లి పట్టణాల్లో స్వయం సహాయక సంఘాలకు రుణాల పంపిణీలో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగినట్టు తెలుస్తోంది. రెండు ప్రైవేటు బ్యాంకుల్లో తీసుకున్న రుణాల్లో అక్రమాలు జరిగాయని ఆరోపణలు వచ్చాయి. ఈ ఘటనలో మొత్తం ఇద్దరు మహిళా ఉద్యోగులతో పాటు పలువురు మెప్మా అదికారులు కూడా కీలక భూమిక పోషించినట్టు తెలిసింది.

గత ప్రభుత్వ హయంలో గుంటూరు డిసిసిబిలో రైతుల పేరుతో నకిలీ రుణాలు మంజూరు చేసినట్టు ఈ సారి మహిళల పొదుపు సంఘాల పేరుతో నిధులు స్వాహా చేసినట్టు తెలుస్తోంది. ఈ వ్యవహారంపై మెప్మా అధికారులతో పాటు బ్యాంకర్లు విచారణ చేస్తున్నట్టు తెలిసింది. డ్వాక్రా మహిళల రుణాలలో జరిగిన అక్రమాలూపై సచివాలంయంలో బుధవారం జరిగిన కలెక్టర్ల సమావేశంలో కూడా చర్చ జరిగింది. సిఎం చంద్రబాబు కూడా ఈ అంశంపై పల్నాడు కలెక్టర్‌తో చర్చించినట్టు వార్తలు వచ్చాయి. నిధులు దుర్వినియోగంపై చర్యలు తీసుకోవాలని పల్నాడు కలెక్టర్‌ను సిఎం ఆదేశించారు. వారి ఆస్తులను కూడా జప్తు చేయాలన్నారు. ఈమేరకు ఆమె విచారణ చేయాలని పల్నాడు జిల్లా అధికారులును కోరారు. అమరావతి మండలలో జరిగిన కుంభకోణాలు సిఎం దృష్టికి వెళ్లాయి. తాజా శుక్రవారం మెప్మా రుణాల మంజూరులో అక్రమాలు వెలుగుచూశాయి. రుణాల మంజూరులో కమ్యూనిటీ కో-ఆర్డినేటర్లు, రిసోర్సు పర్సన్ పాత్ర కూడా ఉన్నట్టు తెలిసింది. గతంలో గుంటూరు తూర్పు నియోజకవర్గంలోని మెప్మా కార్యాలయం కేంద్రంగా నకిలీ సంఘాల పేరుతో ఆటోనగర్ లోని ఒక బ్యాంకులో పెద్ద ఎత్తున నిధులు దారిమళ్లినట్టు తెలిసింది.

కొంచం ఇష్టం.. కొంచం కష్టం..

(మొదటి పేజీ తరువాయి)

చెప్పారు. ఇంటి నిర్మాణానికి రూ. లక్షా 80 వేలు, రవాణా ఖర్చులు గతంలో రూ.50 వేలు ప్రస్తుతం రూ.72 వేలు, చిరువ్యాపారులకు రూ.36 వేలు గ్రాంటుగా చెల్లించడంతో పాటు అమరావతి జీవన భృతి రూ.5 వేలను పదేళ్ల పాటు ఇస్తారని చెప్పారు. ప్రత్యామ్నాయంగా ఇళ్లు నిర్మించే చోట రోడ్లు, డ్రెయినేజీ, తాగునీరు లాంటి సౌకర్యాలు కల్పిస్తామని ఎమ్మెల్యే శ్రావణ్ కుమార్ చెప్పారు. రాయపూడిలోని ప్రగతినగర్‌లో చేశామని ఎమ్మెల్యే అనగా గ్రామస్తులు అభ్యంతరం వ్యక్తం చేశారు. 40 అడుగుల రోడ్లు అని చెప్పి 13 అడుగుల రోడ్లు వేసి సైడ్ కాల్వలు నిర్మించ లేదని దెప్పిపొడిచారు. దీనికి మధ్యలో టిడిపి ప్రభుత్వం లేదని..' ఎమ్మెల్యే అన్నారు.

ల్యాండ్ పూలింగ్‌లో ఇవ్వని భూముల్లో ప్లాట్లు కేటాయించారని, సమస్యను పరిష్కరించాలంటే ప్లాట్లను వేరే గ్రామాల్లో కేటాయించారని కొంతమంది అనగా..'ఇప్పుడు రోడ్డు విషయం మాత్రమే మాట్లాడాలి' అని సూచించారు. అయినప్పటికీ రైతులు రోడ్డు విషయంలోనూ సిఆర్‌డిఎ అధికారులపై మాకు నమ్మకం లేదని, బ్రోకర్‌లను పెట్టుకొని మల్కాపురం సిఆర్‌డిఎ అధికారులు మమ్మల్ని అవమానించారని మండిపడ్డారు. గతంలో పనిచేసిన సిఆర్‌డిఎ అధికారులు చాలామంది వేరే చోటుకు వెళ్లారని, ఇప్పుడు అలా కాదని సర్ది చెప్పే ప్రయత్నం చేశారు. మందడం గ్రామంలో నాలుగేళ్లుగా తాగునీటి సమస్య ఉందని ఆందోళన చేస్తే కేసులు పెట్టారని, ఎస్సీ, ఎస్టీ కాలనీలో తాగునీటి పైపులు పగిలితే అధికారులు పట్టించుకోలేదని అన్నారు. జనవరి రెండవ వారం నుంచి రాజధాని గ్రామాల్లో తాగునీరు, రోడ్లు, విద్యుత్, డ్రెయినేజీ తదితర మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. రోడ్డు నిర్మాణం విషయంలో భిన్నాభిప్రాయాలు వ్యక్తమైనందున మరోసారి సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రత్యామ్నాయ స్థలాలు ఎక్కడిస్తారు అభివృద్ధి ఎప్పుడు చేస్తారు? లాంటి విషయాలను స్పష్టంగా చెప్పాక తదుపరి చర్యలకు ప్రభుత్వం చెడ్డ పడుతుందని చెప్పి సమావేశాన్ని ముగించారు. కార్యక్రమంలో సిఆర్‌డిఎ డిప్యూటీ కలెక్టర్ శేషిరెడ్డి, సర్వేయర్లు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగ అరెస్టు

ప్రజాశక్తి-నరసరావుపేట

ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రాంతంలో మోటార్ సైకిల్ దొంగతనం చేస్తున్న షేక్ ఇస్మాయిల్‌ను 2వ పట్టణ పోలీసులు అరెస్టు చేసినట్లు సిఐ ప్రభాకర్ తెలిపారు. గుంటూరు మిర్చి యార్డులో ముఠాకూలీగా పనిచేసే ఇస్మాయిల్ చెడు వ్యసనాలకు బానిసగా మారి నరసరావుపేటలో 3, చిలకలూరిపేటలో 2, గుంటూరు నగరం పాలెంలో 2, మేదరమెట్ల ఒక ద్విచక్ర వాహనాన్ని ఇస్మాయిల్ దొంగతనం చేయడం జరిగిందన్నారు. ఈ నెల 18 న ఎస్సై తమ పోలీస్ సిబ్బంది గుంటూరు రోడ్ లో ఇస్మాయిల్ ను అదుపులోకి తీసుకోవడం జరిగిందన్నారు. మోటార్ సైకిల్ చోరీ కేసులో ముద్దాయిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన సీఐ ప్రభాకర్ తో పాటు వారి సిబ్బందిని డి.ఎస్.పి హనుమంతరావు ప్రత్యేకంగా అభినందించారు.

మహిళ మృతిపై కేసు నమోదు

ప్రజాశక్తి - పెదకూరపాడు

తన కుమార్తె కళ్యాణిని భర్త పోతురాజు, అత్త, ఆడబిడ్డ అధిక కట్నం కోసం వేధింపుల వలన మృతి చెందిందని మర్రి అన్నపూర్ణ ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు ఆధారంగా ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అచ్చంపేట మండలం లోని తాళ్ళచెరువు గ్రామానికి చెందిన తన కుమార్తె కళ్యాణిని ఇప్పటికి ఐదు సంవత్స రాలు క్రితం పెదకూరపాడు గ్రామానికి చెందిన బోరుగడ్డ పోతురాజు తో వివాహం జరిపించామన్నారు. అయితే గత కొంతకాలం నుండి ఫిర్యాదు కుమార్తె మృతురాలని తన భర్త పోతురాజు అత్త మరియు ఆడబిడ్డ అధిక కట్నం కోసం శారీరకంగా మానసికంగా హింసించట ంతో పెట్టే బాధలు భరించలేక పెదకూం ˊపాడు గ్రామంలోని తన ఇంటిలో ఫ్యానుకు ఉరి వేసుకొని మృతి చెందింది. కేసు నమోదు చేసి ఎస్సై గిరిబాబు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ దాడి

ప్రజాశక్తి - తెనాలి

పేకాట శిబిరంపై టాస్క్ ఫోర్స్ బృందం దాడి చేసింది. పోలీసులు వెల్లడించిన వివరాల ప్రకారం పక్కా సమాచారంతో పట్టణ ఐతానగర్‌లోని ఓ ఇంటిపై స్పెషల్ బ్రాంచ్ పోలీసులు, టాస్క్ ఫోర్స్ బందం శుక్రవారం రాత్రి ఆకస్మిక దాడులు నిర్వహించారు. ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి రూ. 50,200, నాలుగు సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. ఇదే ఇంట్లో తరచూ పేకాట నిర్వహిస్తున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించినట్టు పోలీసులు తెలిపారు.

రైల్వే ఫ్లాట్‌ఫాంపై మహిళ మృతదేహం

ప్రజాశక్తి తెనాలి

స్థానిక రైల్వే స్టేషన్ ఒకటో నంబరు ప్లాట్‌ఫాంపై గుర్తు తెలియని మహిళ శు క్రవారం రాత్రి మతి చెందింది. మతురాలి వయసు సుమారు 40 నుండి 45 మధ్య ఉంటుందని, ఆకుపచ్చ స్వెట్టర్ ధరించి ఉందని, సమాచారం అందుకున్న జీఆర్పీ పోలీసులు మతదేహాన్ని తెనాలి వైద్యశాల మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఇన్‌చార్జి ఎస్ఐ రమేష్‌బాబు తెలిపారు. ఆచూకీ తెలిసిన వారు జీఆర్పీ స్టేషన్‌లో సంప్రదించాలని కోరారు.



ప్రమాదంలో మృతి చెందిన మణికంఠ రెడ్డి

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి - నాదెండ్ల

మండలంలోని నాదెండ్ల తిమ్మాపురం వెళ్ళేదారిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఫిరంగిపురం మండలం మేరికపూడి గ్రామానికి చెందిన పాకనాటి శ్రీసత్య సాయి మణికంఠ రెడ్డి (21) దుర్మరణం చెందాడు. మృతుడు మేరికపూడి నుండి గొరిజవోలు మీదుగా (రాయల్ ఎన్ ఫీల్డ్ బులెట్ ద్విచక్రవాహనం) వెళుతున్న క్రమంలో నాదెండ్ల పరిధిలో ఉన్న మలుపు వద్ద యడ్లపాడు నుండి నాదెండ్ల వైపు ఎదురుగా వస్తున్న ట్రాక్టరును ఢీకొనడంతో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మతి చెందాడు. సమాచారం అందుకున్న నాదెండ్ల ఎస్సై ఆర్.వెంకటేశ్వరరావు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని చిలకలూరిపేట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ట్రాక్టరును, ద్విచక్రవాహనాన్ని పోలీసు స్టేషనుకు తరలించి కేసు నమోదు చేశారు.



గ్రామాలలో బ్యానర్లు ఏర్పాటు చేస్తున్న సిబ్బంది

రేపటి పల్స్ పోలియోపై ప్రచారం

ప్రజాశక్తి - పెదనందిపాడు

పెదనందిపాడు పీహెచ్‌సి పరిధిలోని అన్ని గ్రామాలలో ఈనెల 21వ తేదీ ఆదివారం నిర్వహించే పల్స్ పోలియో కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కలిగించేందుకు శుక్రవారం గ్రామాలలోని వివిధ కూడళ్లలో సంబంధిత ఆరోగ్య సిబ్బందిచే పల్స్ పోలియో బ్యానర్స్ ఏర్పాటు చేశారు. కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సిహెచ్‌ఓ ప్రసాద్ స్వామి తెలియజేశారు.

ప్రజాశక్తి - రెంటచింతల

తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించి వారి భవిష్యత్తును రక్షించాలని పీహెచ్సీ డాక్టర్ ఎన్.కృష్ణారెడ్డి చెప్పారు. శుక్రవారం పీహెచ్సీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్ల చిన్నారులు 3690 మంది వున్నట్లు గుర్తించామన్నారు. ఇందు కోసం 4000 డోసులను ఇప్పటికే పీహెచ్సీలో సిద్ధంగా ఉంచామని వెల్లడించారు. సమావేశంలో సూపర్‌వైజర్ కోటేశ్వరరావు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

కెరీర్ ఫెస్ట్ కమ్ ఎగ్జిబిషన్

ప్రజాశక్తి-పెదకూరపాడు

మండలంలోని 75 త్యాళ్ళూరు పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఈనెల 15 నుండి స్కూల్లో ఏర్పాటు చేసిన కెరీర్ ఫెస్ట్ కమ్ ఎగ్జిబిషన్ శుక్ర వారంతో ముగిసింది.విద్యార్థులు కెరీర్ గైడెన్స్ చార్ట్‌లు, మోడల్స్‌చార్ట్‌ల వృత్తిపరమైన దుస్తులతో థీమ్‌లను ప్రదర్శించారు. హెచ్‌ఎం శ్రీనివాసరెడ్డి,ఇబ్రహీం ఖలీలుల్లా, ఒకేషనల్ ట్రైనర్స్ సునీత, ఖనీదా పాల్గొన్నారు.

కూలిన నేరేళ్ల వాగు బ్రిడ్జి

ప్రజాశక్తి - ఫిరంగిపురం



కూలిన నేరేళ్ల వాగు బ్రిడ్జి

మండలంలోని ఫిరంగిపురం 113 తాళ్లూరు గ్రామాల మధ్య కరెంట్ ఆఫీస్ సమీపంలో ఉన్న నేరేళ్ల వాగు బ్రిడ్జి గురువారం రాత్రి ఆకస్మికంగా కూలిపోయింది. దీంతో ఫిరంగిపురం నుంచి 113 తాళ్లూరు, సిరంగిపాలెం తక్కెళ్ళ పాడు, కొమెరపూడి, కంటెపూడి మీదగా సత్తెనపల్లికి రాకపోకలు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నేరేళ్ల వాగు కొద్ది రోజుల్లో కూలిపోతుందని తెలిసీ అధికారులు, ప్రజాప్రతి నిధుల పట్టించుకోకపోవడంతో బిడ్జి కూలిపోయింది. బ్రిడ్జి కూలిపోయే సమయంలో ఎవరికీ ప్రాణాపాయం లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. ఫిరంగిపురం నుంచి సత్తెనపల్లి వరకు జీవనోపాధి కోసం వివిధ వ్యాపారాలు నిమిత్తం రాకపోకలు కొనసాగించే ప్రయాణికులు వాహనదారులు పలు ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని కోరుతున్నారు.

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి - కాకుమను

డీలర్లు తమ దుకాణాలను ప్రభుత్వం నిర్దేశించిన సమయాలలో తెరిచి ఉంచాలని డిప్యూటీ తహశీల్దార్ శివశంకర్ అన్నారు. శుక్రవారం ప్రత్తిపాడు, వట్టిచెరుకూరు మండల తహశీల్దార్ కార్యాలయాలలో రేషన్‌షాప్ డీలర్లతో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి నెల 26వ తేదీ నుండి 30వ తారీకు లోపు 65 సంవత్సరాలు దాటిన వాళ్లఇళ్లకు వెళ్ళి పంపిణీ చేయాలనీ, ప్రతి దుకాణం స్టాక్ బోర్డులు మెయింటైన్ చేయాలని అన్నారు.

దొంగల హల్‌చల్

ప్రజాశక్తి తెనాలి

ఘటన త్రీ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో చెంచుపేట ప్రాంతంలో శుక్రవారం రాత్రి దొంగలు హల్చల్ చేశారు. ఓ ఇంట్లోకి ప్రవేశించి సెల్‌ఫోను అపహరించారన్న ఫిర్యాదుతో పోలీసులు అప్రమత్తమై ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆ ప్రాంతంలో దాదాపు రెండు మూడు ఇళ్లలో దొంగలు దొంగతనానికి ప్రయత్నించి నట్లు స్థానికులు పోలీసుల ద ష్టికి తెచ్చారు. ఘటనా స్థలాన్ని పరిశీలించిన సీఐ ఎస్ సాంబశివరావు మాట్లాడుతూ క్రిస్మస్, సంక్రాంతి వేళలో దొంగల స్వైర విహారం ఉంటుందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని చెప్పారు. ఎంతో ఖర్చుతో నిర్మించే అపార్ట్మెంట్లలో సైతం సీసీ కెమెరాలు లేకపోవడం దొంగలకు ఆటవిడుపుగా మారిందన్నారు. సాధ్యమైనంత వరకు సిసి కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఊరెళ్ళే సమయంలో బయటకు కనిపించే విధంగా తాళం వేయడం, ఇంట్లో ఎవరూ లేరన్న సంకేతాన్ని దొంగకు తెలియజేయడమేనన్నారు. ఇలాంటి విషయాలలో ప్రజలు జాగ్రత్తగా వహించాలన్నారు. పోలీస్ నిఘా రాత్రి వేళలో ఉంటుందని చెప్పారు. సెల్‌ఫోన్ అపహరణకు సంబంధించి సమీపంలోని సిసి కెమెరాలు పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు.

సీఎంకు అవార్డు తెలుగు వారికి గర్వకారణం

ప్రజాశక్తి - రెంటచింతల

రాష్ట్రాన్ని అభివృద్ధి సంక్షేమాన్ని, పారిశ్రామిక సంస్కరణలు చేపట్టడం,పెద్ద ఎత్తున పెట్టుబడులు ఆకర్షించడం వంటి కృషికి గుర్తింపుగా చంద్రబాబుకు ప్రతిష్టాకరమైన బిజినెస్ రిఫార్మర్ ఆఫ్ ది ఇయర్ 2025 ఆవార్డును ఎకనామిక్ టైమ్స్ ప్రకటించిందని శిల్పారామం చైర్మన్ చేర్రెడ్డి మంజులారెడ్డి అన్నారు. శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పారిశ్రామికవృద్ధిలో వున్న రాష్ట్రాన్ని చంద్రబాబు నాయకత్వంలో పరిశ్రమలు పరుగులు పెట్టబోతున్నాయన్నారు. సమావేశంలో నాళం పెదబాబు, సైదులు యాదవ్, కొత్త అంజి, తెలుగుయువత అధికార ప్రతినిధి తొడపనేని కోటేశ్వరరావు,పోట్ల సైదారావు, టీడీపీ ఉపాధ్యక్షులు ప్రముఖ బీసీ నేతనారాయణపురం శ్రీనివాసరావు, వైవీ సైదయ్య ఆకుల నరశింహా రావు పాల్గొన్నారు.

వాహన చోదకులకు కౌన్సిలింగ్

ప్రజాశక్తి - రెంటచింతల

ద్విచక్ర వాహనచోదకులు హెల్మెట్ తప్పనిసరిగా పెట్టుకోవాలని ఎస్ఐ సీహెచ్ నాగార్జున కోరారు. శుక్రవారం వివిధ వాహ నాలను తనిఖీ చేశారు. ప్రమాదాలు జరిగినప్పుడు ద్విచక్రవాహనదారులు హెల్మెట్ ధరిస్తే ప్రాణాలకు రక్షణ కలుగు తుందన్నారు. చిన్న నిర్లక్ష్యంతో ప్రాణాలు పోగొట్టుకోవడమే కాకుండా కుటుంబాలను అంధకారం చేస్తుందని చెప్పారు. మైనర్లకు వాహనాలివ్వొద్దన్నారు.

జూదరులు అరెస్టు

ప్రజాశక్తి- చిలకలూరిపేట

మండల పరిధిలోని గోపాలంవారిపాలెం గ్రామ శివార్లలో పేకాట స్థావరంపై రూరల్ పోలీసులు శుక్రవారం దాడి చేశారు. పోలీసులకు అందిన ముందస్తు సమాచారం మేరకు రూరల్ ఎస్ఐ జి. అనిల్‌కుమార్ తన సిబ్బందితో కలిసి దాడి చేశారు. దాడిలో 'కోత ముక్క' ఆడుతున్న తొమ్మిది మందిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి రూ.18,200లను, వారు వినియోగిస్తున్న ఒక ఆటోను, నాలుగు మోటార్‌సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అనిల్‌కుమార్ తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ప్రజాశక్తి సత్తెనపల్లి రూరల్

పేకాట స్థావరంపై దాడిచేసి 11 మంది జూదరులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 23100రూపాయల నగదు స్వాధీనం చేసుకున్నట్లు సత్తెనపల్లి రూరల్ సిఐ ఎం హైమారావు తెలిపారు. సత్తెనపల్లి మండలం ధూళిపాళ్ల సమీపంలోని పంటపొలాల్లో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు రూరల్ సిఐ హైమారావు సిబ్బందితో దాడిచేసి 11 మంది జూదరులను పట్టుకున్నారు. జూదరులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ కోడిపందాలు, పేకాట ఆడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

మృతురాలి కళ్లు దానం



రాజకుమారి (ఫైల్)

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

రొంపిచర్ల మండలం వడ్లమూడివారిపాలెం గ్రామానికి చెందిన పేర్ల రాజకుమారి (64) శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు పెదకాకాని శంకర కంటి ఆసుపత్రి ఐ బ్యాంక్‌కు దానం చేశారు. అమ్మ నేత్ర, అవయవ, శరీర దాన ప్రోత్సాహకుల సంఘం జిల్లా కో-ఆర్డినేటర్ ఎస్.చలపతిరావు మాట్లాడుతూ ఎవరైనా మృతి చెందిన 10 గంటలలోపు నేత్రాలను దానం చేయవచ్చని తెలిపారు. వాటిని ఐ బ్యాంక్‌లో ఉంచి అంధులకు ఆపరేషన్ చేసి చూపి రప్పిస్తామని చెప్పారు. పూడ్చితే మట్టిలో కలిసిపోవడం, దహనం చేస్తే కలిపోయే శరీరాన్ని, నేత్రాలను దానం చేయాలన్నారు. నేత్రాలను దానం చేసిన మృతురాలి కుటుంబ సభ్యులను పలువురు అభినందించారు.

అభివృద్ధి నిరోధకతకు నిరక్షరాస్యతే కారణం

పల్నాడు జిల్లా కలెక్టర్ కృతిక శుక్ల



ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

అభివృద్ధి నిరోధకతకు నిరక్షరాస్యత ప్రధాన కారణమని, పల్నాడు జిల్లా సమగ్ర అభివృద్ధిని సాధించాలంటే అక్షరాస్యత ఎంతో అవసరమని పల్నాడు జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్లా అన్నారు. శుక్రవారం జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన అక్షరాంధ్ర జిల్లా సమీక్ష సమావేశంలో అధికారులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడారు. రాష్ట్రంలోని అక్షరాస్యత కలిగిన జిల్లాలలో పల్నాడు జిల్లా క్రింది నుంచి 3వ స్థానంలో ఉందన్నారు. స్వయం సహాయక గ్రూపులలోని పలు అవకతవకలకు ప్రధాన కారణం నిరక్షసాస్యతే అని తెలిపారు. జిల్లాలోని అక్షర కేంద్రాలను విధిగా మండల స్థాయి అధికారులు తనిఖీలు చేయాలని సూచించారు. డిఆర్‌డిఎ, డ్వామా, మెప్మా పీడీలు జిల్లాకు నిర్దేశించిన 127565 నిరక్షరాస్యులను అక్షరాస్యులు చేయడంలో ప్రధాన పాత్ర పోషించాలని ఆదేశించారు. సమావేశంలో వయోజన విద్యాశాఖ అధికారి ఆంజనేయులు, నోడల్ అధికారి మల్లికార్జునరావు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్మికుపై దాడికి నిరసన

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మున్సిపల్ కార్మికుల న్యాయమైన డిమాండ్ పరిష్కారం చేయాలని కోరుతూ నెల్లూరు జిల్లాలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న మున్సిపల్ కార్మికులపై పోలీసుల లాఠీచార్జి, అక్రమ అరెస్టును ఖండిస్తూ పట్టణంలోని బంగ్లా సెంటర్ వద్ద శుక్రవారం కార్మికులు నిరసన తెలిపారు. సిఐటియు మండల కన్వీనర్ టి.శ్రీనివాసరావు మాట్లాడుతూ మున్సిపల్ శాఖ మంత్రి సొంత జిల్లాలో దాడి చేయడం, 63 మంది కార్మికుల అరెస్టు చేసి, ఊరికి 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న పోలీస్ స్టేషన్ తరలించడం అమానుషమైన చర్య అని విమర్శించారు. 42 రోజులుగా సమస్యలపై పోరాడుతున్న వారితో చర్చించకుండా, ఎదురు దాడి చేయడం ఏమిటని ప్రశ్నించారు. సమ్మె కాలపు డిమాండ్ అమలు చేయాలని, వర్క్ అవుట్సోర్సింగ్ విధానాన్ని వెనక తీసుకోవాలని, వెంటనే పరిష్కరించాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా కార్మికులు పోరాటంలో దిగుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, మున్సిపల్ కార్మికులు రామారావు, కొండలు, మార్తమ్మ, కోటేశ్వరరావు, కృష్ణవేణి, పద్మ, ప్రతాప్ పాల్గొన్నారు.



ఆకట్టుకున్న జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ కమిషనర్ ఆదేశాలతో ఎస్సిఈఆర్టీ, సమగ్ర శిశు, పల్నాటి విద్యాశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం నరసరావుపేట పట్టణం పల్నాడు రోడ్డు లోని పి.ఎన్.సి - కె.ఆర్ కళాశాలలో నిర్వహించిన పల్నాడు జిల్లా స్థాయి విద్యా వైజ్ఞానిక ప్రదర్శన విద్యార్థులను ఎంతగానో ఆకట్టుకుంది. ప్రదర్శనను ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు ప్రారంభించారు. జిల్లాలోని 28 మండలాల నుంచి 140 ప్రాజెక్టులు విద్యార్థులు ప్రదర్శించగా ఎమ్మెల్యే ఆసక్తిగా తిలకించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నరసరావుపేట పట్టణం కవులు, కళాకారులు, రచయితలు, విభిన్న సంస్కృతులకు నిలయమని, ఒక అడుగు ముందుకు వేసిన మన విద్యార్థులు సృజనాత్మకతతో కూడిన నూతన ఆవిష్కరణలను ప్రదర్శించడం గర్వంగా ఉందన్నారు. కృత్రిమ మేధస్సు (ఏఐ), ఐటీ, ఇతర రంగాల అభివృద్ధి వేగంగా జరుగుతుందని, దీనిని నేటి విద్యార్థులు అందిపుచ్చుకోవాలని సూచించారు. రాష్ట్ర గ్రంథాలయ



విద్యార్థుల ప్రదర్శనలను ఆసక్తిగా తిలకిస్తున్న ఎమ్మెల్యే

చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ విద్యార్థులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించి శాస్త్రవేత్తలను తయారు చేసేందుకు ఇటువంటి వైజ్ఞానిక ప్రదర్శనలు దోహదం చేస్తాయన్నారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శిల్పారామం ఆర్ట్స్, క్రాఫ్ట్స్-సాంస్కృతిక సంస్థ చైర్మన్ సిహెచ్.మంజులరెడ్డి, ఏపి నాయీబ్రాహ్మణ ఫెడరేషన్ డైరెక్టర్ మద్దిరాల గంగాధర్, పల్నాడు జిల్లా విద్యాశాఖ అధికారి పివిజె రామారావు, డివైఈఓ లు షేక్. సుభాని, వి.ఏసుబాబు, ఎంఈఓలు జాఫరుల్లా, సాంబశివరావు, హెచ్‌ఎం గోవిందరాజులు, బిఎం సుభాని, వరప్రసాద్, హనుమంతరావు, వెంకట్రావు, డిఎస్ఓ ఎస్. రాజశేఖర్, ఏపి. మధుకుమార్, సిహెచ్. వీరప్పయ్య, పి.ఎన్.సి-కే.ఆర్ కళాశాల జాయింట్ సెక్రెటరీ పి.శ్రీనివాస ప్రసాద్, పార్వతి తదితరులు పాల్గొన్నారు.

ఇనుమెళ్ల పాఠశాలకు ద్వితీయ స్థానం

ప్రజాశక్తి- బొల్లాపల్లి

జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలో ఈపూరు మండలం ఇనుమెళ్ల జెడ్‌పి పాఠశాల విద్యార్థినులు ద్వితీయ స్థానం సాధించినట్లు హెచ్‌ఎం ఎన్.నాగలక్ష్మి తెలిపారు. షేక్ సాయి దర్శిత, షేక్ సాదియాబి, సైన్సు ఉపాధ్యాయులు జి.తిరుపతిరెడ్డి, బి.మాధవరావు పర్యవేక్షణలో వేస్ట్ మేనేజ్మెంట్, ఆల్టర్నేటివ్ టు ప్లాస్టిక్ థీమ్‌ను ప్రదర్శించి విజయం సాధించారన్నారు.



డ్వాక్రా గ్రూపు కుంభకోణంలో టిడిపి నాయకుల పాత్ర

- వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి
- నిందితులను అరెస్టు చేసి డబ్బును రికవరీ చేయాలని డిఆర్‌ఓకు వినతి

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

డ్వాక్రా గ్రూపు కుంభకోణంలో స్థానిక టిడిపి నాయకుల ప్రమేయం ఉందని వైసిపి పల్నాడు జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షులు డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఆరోపించారు. నరసరావుపేట డ్వాక్రా గ్రూపుల రుణాలకు సంబంధించి జరిగిన రూ.20 కోట్ల కుంభకోణానికి సంబంధించిన వ్యవహారంలో నిందితులను వెంటనే అరెస్టు చేయాలని కోరుతూ శుక్రవారం కలెక్టరేట్ లో జిల్లా రెవిన్యూ అధికారి ఎ.మురళికి వినతిపత్రం అందజేశారు. అనంతరం కలెక్టరేట్ వద్ద విలేకర్లతో మాట్లాడుతూ టిడిపి కూటమి ప్రభుత్వం వచ్చిన 18 నెలల కాలంలో నరసరావుపేట మెప్మా అధికారుల ప్రోద్బలంతో దాదాపు 140 కి పైగా నకిలీ డ్వాక్రా గ్రూపులు సష్టించి రూ 20 కోట్ల మేర నిధులు కాజేశారన్నారు. గుంటూరు జిల్లా నల్లపాడు మున్సిపల్ కార్పొరేషన్ లో పనిచేసి సస్పెండ్ అయిన డ్వాక్రా సిటీ మిషన్ మేనేజర్ దీప, డ్వాక్రా గ్రూపుల సిసి ప్రణతి టిడిపి నాయకుల ప్రమేయంతో ఆర్.పి లతో కుమ్మక్కై అవినీతికి పాల్పడ్డారన్నారు. అవినీతి ఆరోపణలతో సస్పెండ్ అయిన అధికారిని నరసరావుపేట ఎమ్మెల్యే, అతని అనుచరులు నరసరావుపేటలో పోస్టింగ్ ఇప్పించారన్నారు. ఒక్కొక్క గ్రూప్‌కు రూ.15 నుండి రూ.20 లక్షలు ఇప్పించి రూ.5 లక్షల చొప్పున ఒక్కొక్క డ్వాక్రా గ్రూపు వద్ద నుంచి అక్రమంగా వసూలు చేశారని సగం ఎమ్మెల్యేకు ముట్టాయని అన్నారు. నవంబర్ 20న పిజిఆర్ఎస్‌లో డ్వాక్రా గ్రూపు మహిళ ఫిర్యాదు ఆధారంగా విచారణ జరిపితే భారీ స్థాయిలో అక్రమాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందన్నారు. అవినీతి అక్రమాల వివరాలు



కలెక్టర్ల సమావేశంలో ముఖ్యమంత్రికి తెలియజేసి ఈ స్కాం ను బయట పెట్టిన జిల్లా కలెక్టర్ కృతిక శుక్లకు అభినందనలు తెలిపారు. అవినీతి అక్రమాలకు సంబంధించి తమ వద్ద ఆధారాలతో పాటు మరికొన్ని ఆధారాలు సేకరించి జిల్లా కలెక్టర్ అందజేస్తామన్నారు. అక్రమాలలో సూత్రధారులను,పాత్ర దారులను అరెస్ట్ చేసి, సహకరించిన అధికారులను సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. సరైన పరిశీలన, ఎటువంటి హామీ లేకుండా కేవలం ఆధార్ కార్డుల మీద రుణాలు ఇచ్చి ఈ కుంభకోణానికి కారకులైన బ్యాంకు అధికారులను కూడా విచారించాలన్నారు.

ఉపాధి హామీ చట్టం రద్దుకు కేంద్రం కుట్ర



ప్రజాశక్తి-పిడుగురాళ్ల

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి చట్టాన్ని రద్దు చేయడానికి కేంద్ర ప్రభుత్వం కుట్రల పన్నుతుందని, కొత్త సవరణలు వెనక తీసుకోవాలని కోరుతూ సిఐటియు వ్యవసాయ కార్మిక సంఘం , రైతు సంఘాల ఆధ్వర్యంలో పట్టణంలోని జాతీయ గ్రామీణ ఉపాధి కార్యాలయం వద్ద శుక్రవారం ధర్నా చేశారు. అనంతరం ఎంపిడిఓకు వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ తెలవపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం ఇప్పటికే వ్యవసాయ రంగాన్ని కార్పొరేటర్ల చేతిలో కట్టబెట్టే విధానాల తీసుకొస్తుందని, దీనిలో భాగంగానే నల్ల చట్టాలు తీసుకొస్తే వాటికి వ్యతిరేకంగా రైతులు ఐక్యంగా పోరాడి రద్దు చేయించుకోగలిగారని ఆయన గుర్తు చేశారు. గ్రామాల్లో ప్రజలకు వలసలు నివారించి, కుటుంబాలు పోషించుకోవడానికి ఆసరాగా ఉన్న ఈ పథకాన్ని రద్దు చేయడం సిగ్గుచేటని ఆయన విమర్శించారు. ఇప్పటివరకు ఈ పథకానికి కేంద్ర ప్రభుత్వం 90శాతం రాష్ట్రప్రభుత్వం 10శాతం నిదు లుకేటాయించి వస్తుందని భవిష్యత్తులో కేంద్ర ప్రభుత్వం 60 శాతం రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం ఈ పథకాన్ని నిర్వహించే విధంగా కొత్త బిల్లు రూపొందించింది. దీనివలన రాష్ట్రాలపై ఆర్థిక భారం పడుతుందని అన్నారు. బిల్లు సవరణలపై కూటమి ప్రభుత్వం, వైసిపి నోరు మెదపటం లేదని విమర్శించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కన్వీనర్ నాయకులు బత్తుల వెంకటేశ్వర్లు, దేవుళ్ళ భూలక్ష్మి, గుర్రం కొండమ్మ, ఎడమ కంటి కోటిరెడ్డి, గుదే బిక్షాలు, మీసాల జయరాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ కోటా సాయికుమార్ పాల్గొన్నారు.



ప్రజాశక్తి - అమరావతి

స్థానిక పాత లారీ ఆఫీస్ వద్ద సిపిఎం ఆధ్వర్యంలో బిల్లు ప్రతులను దహనం చేశారు. సిపిఎం అమరావతి రూరల్ కార్యదర్శి సయ్యద్ మెహదీన్ వలి మాట్లాడారు. తాజా చట్టం ప్రకారం 125 రోజులు పని కల్పించామని గొప్పలు చెబుతున్నారని, అయితే 200 రోజులు పని కల్పించాలని డిమాండ్ ఎప్పటినుంచో చేస్తున్నామని అన్నారు. మహాత్మ గాంధీ గ్రామీణ ఉపాధి చట్టం పేరుతో కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం అమరావతి పట్టణ కార్యదర్శి బి.సూరిబాబు నాయకులు ఎం.సుబ్రహ్మణ్యం ఎస్.కె నాగులమీర, పౌలు, రఫీ, రాములు, మధు, సూరిబాబు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

పేదల ఉపాధికి గండి

ఉపాధిహామీ చట్ట సవరణపై సిపిఎం నిరసన - బిల్లు ప్రతుల దహనం


మంగళగిరిలో ప్రతులు దహనం చేసి నిరసన తెలుపుతున్న నాయకులు

ప్రజాశక్తి - మంగళగిరి

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టానికి కేంద్రం ప్రభుత్వం చేస్తున్న సవరణలకు వ్యతిరేకంగా సిపిఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా శుక్రవారం మంగళగిరి లో సిపిఎం మంగళగిరి పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళగిరి పట్టణంలో గల పాత కూరగాయల మార్కెట్ వద్ద గల గాంధీ విగ్రహం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సిపిఎం మంగళగిరి పట్టణ కార్యదర్శి వివి జవహర్లాల్ అధ్యక్షతన కార్యక్రమంలో సిపిఎం గుంటూరు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు పాశం రామారావు మాట్లాడుతూ ఉపాధి హామీ చట్టం ఊరికే రాలేదని 2005 సంవత్సరంలో యూపీఏ ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీల ఎంపీలు 63 మంది మద్దతు తెలియజేయడం జరిగిందని, ఆ సందర్భంగా వామపక్షాలు పట్టు పట్టడంతో వ్యవసాయ కార్మికులకు దేశవ్యాప్తంగా ఉపాధి కల్పించేందుకు ఉపాధి హామీ చట్టాన్ని తీసుకురావడం జరిగిందని అన్నారు. ఈ పథకం ప్రారంభమైన తొలి సంవత్సరంలో రూ.1,20,000 కోట్ల కేటాయించడం జరిగిందని అన్నారు. అప్పటినుండి వేసవిలో పనులు లేని సమయంలో వంద రోజులు పని కల్పించడం జరిగిందని అన్నారు. ఈ పథకం దేశవ్యాప్తంగా పేద ప్రజలకు ఉపయోగపడుతుందని అన్నారు. బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి నిధులు తగ్గిస్తూ వచ్చిందని అన్నారు. ప్రస్తుతం ఈ చట్టానికి తూట్లు పొడుస్తూ సవరణల పేరుతో పేద వ్యవసాయ కార్మికులకు నష్టం కలిగించే విధంగా తీసుకు వస్తున్నారని విమర్శించారు. సిపిఎం రాష్ట్ర నాయకులు కే ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ భూస్వాముల ఒత్తిడితోనే ఉపాధి హామీ సవరణలు తీసుకువచ్చారని విమర్శించారు. కొన్ని ప్రాంతాలలో ఉపాధి హామీ పథకం అమలులోకి వచ్చిన తర్వాత కూలీలు దొరకడం లేదని సాకుతో భూస్వాములు ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చారని అన్నారు. ప్రస్తుతం కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం మహాత్మా గాంధీ పేరును తొలగించడమే కాదని, వ్యవసాయ కార్మికులకు మేలు కలిగే ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేయడానికి చూస్తుందని అన్నారు. ప్రభుత్వం వెనక్కి తగ్గి పాత ఉపాధి హామీ చట్టాన్ని అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు ఎస్ ఎస్ చంగయ్య, సిపిఎం నాయకులు జెవి రాఘవులు, పి బాలకృష్ణ, ఎం బాలాజీ, వై కమలాకర్, పట్టణ నాయకులు ఏం చలపతిరావు, తదితరులు పాల్గొన్నారు. అనంతరం పార్లమెంట్లో బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిన బిల్లు ప్రతులను దహనం చేశారు.

ప్రజాశక్తి - తాడేపల్లి

వామపక్షాల చొరవతో యూపీఏ ప్రభుత్వం తీసుకొచ్చిన గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వం పేరు మార్చి, పథకా న్ని నీరుగాచటం సరిగాదని సిపిఎం సీనియర్ నాయకులు జొన్న శివశంకరరావు విమర్శించారు. మోడీ ప్రభుత్వం పేదలకు కొద్ది, గొప్పఉపయోగపడుతున్న పథకాన్ని ఎత్తివేసే ఉద్దేశంతో పేరు మార్చడం పేద వర్గాలు క్షమించరని విమర్శించారు. ఒక పథకం ప్రకారం కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేయటానికి మోడీ ప్రభుత్వం పనిచేస్తుందని దుయ్యబట్టారు. పేదలకు ఉపయోగపడే పనికి ఆహార పథకాన్ని వెంటనే అమలుపరిచే విధంగా తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి బోరుగ వెంకటేశ్వర్లు, దొంతి రెడ్డి శ్రీనివాస్ కుమారి, వేముల దుర్గారావు, కె మేరీ, టి రామారావు, డి.వి భాస్కర్ రెడ్డి, ఎన్ దుర్గారావు, డి కోదండరామయ్య, జి శ్రీనివాసరావు, పి లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.


తాడేపల్లిలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

మహాత్మగాంధీ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని కొనసాగించాలని కోరుతూ ఆత్మకూరు గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంల గడ్డం అజయ్ కుమార్ మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం అధికారానికి వచ్చిన నాటి నుండి ఉపాధి చట్టానికి నిధులు కోత విధించి ఈ పథకాన్ని నీరు కార్చిందని, ఇది చాలక పేర్లు మార్పులలో భాగంగా చట్టం గా ఉన్నదాన్ని పథకంగా మార్చి ఉపాధి గ్యారెంటీ లేని పరిస్థితికి తీసుకొచ్చి రాష్ట్రాల మీద భారాలు వేసే విధంగా ఏర్పాటు చేసిన ఈ వికసిత్ గ్యారంటీ ఫర్ రోజ్ గార్ అండ్ అజీవిక మిషన్ పథకాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం బిల్లుల ప్రతురులను దగ్ధం చేశారు కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు వుద్దంటి దుర్గారావు చిట్టేల సీతారామాం జనేయులు ఆనందం బాబ్జి చిట్టేల జనార్ధనరావు అనురాధ పాల్గొన్నారు


మేడికొండూరులో

ప్రజాశక్తి - మేడికొండూరు

కేంద్ర ఉపాధి హామీ పథకం పేరు మార్పు చేసి,నిధులు తగ్గించడం వలన ఎలవర్తి పాడు గ్రామంలో కేంద్రం చేసిన బిల్లులను తగలబెట్టారు. ఈ సందరమ్ముగా జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షుడు బొట్ల రామకృష్ణమట్లాడారు కార్యక్రమంలో ఎస్ కే ఇమామ్, పలకలూరు సుభాని, కరిముల్లా, ఆన్సర్ పాల్గొన్నారు.


ఆత్మకూరులో

మున్సిపల్ కార్మికులపై పోలీసుల లాఠీఛార్జీకి నిరసన


మంగళగిరిలో

ప్రజాశక్తి మంగళగిరి : నెల్లూరులో తమ న్యాయమైన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ శాంతియుతంగా ఆందోళన చేస్తున్న మున్సిపల్ కార్పొరేషన్ కార్మికులపై పోలీసులు లాఠీచార్జ్ చేయడం అన్యాయమని ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే ఉమామహేశ్వరరావు అన్నారు. శుక్రవారం ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ కమిటీ ఆధ్వర్యంలో కార్పొరేషన్ కార్యాలయం గేటు ఎం బుక్ తాడేపల్లి మున్సిపల్ కార్మికులను నైట్ డ్యూటీలో కొనసాగించాలని, ఆప్కాస్ లో చేర్చాలని, నెల్లూరు లో కార్పొరేషన్ మున్సిపల్ కార్పొరేషన్ పోలీసులు లాఠీచార్జి చేయడాన్ని ఖండిస్తూ ధర్నా జరిగింది. ఈ ధర్నాను ఉద్దేశించి ఉమామహేశ్వర మాట్లాడుతూ నెల్లూరులో కార్పొరేషన్లో పనిచేస్తున్న మున్సిపల్ కార్మికులు 14 రోజులపాటు సమ్మె చేశారని, ఈ సందర్భంగా ఇచ్చిన ఒప్పందాలను అమలు చేయాలని కోరుతూ ఆందోళన చేస్తున్న వారిపై మహిళలు అని చూడకుండా దారుణంగా పోలీసులు కీచకుల్లా వ్యవహరించారని విమర్శించారు. ఆప్కాస్లో పనిచేస్తున్న కార్మికులు 60 సంవత్సరాలు దిగిపోయిన తర్వాత రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికులకు 62 సంవత్సరాల పాటు వయోపరిమితి పొడిగించాలని డిమాండ్ చేశారు. ఎన్నికలకు ముందు మున్సిపల్ కార్మికుల సమ్మె సందరరేగా ఆనాటి ప్రభుత్వం చేసుకున్న సమ్మె కాలపు ఒప్పందాలను అమలు చేయడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. జనవరి లోపు సమస్యలను పరిష్కరించకపోతే కలిసొచ్చే సంఘాలతో నిరవధిక సమ్మెకు వెళ్తామని హెచ్చరించారు. కార్యక్రమ లో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎస్ ఎస్ చెంగయ్య నాయకులు వైస్ శివ నాగేశ్వరరావు, కె.వెంకటేశ్వరమ్మ, వి వెంగమ్మ, డివైఎఫ్ఐ నాయకులు ఎస్ గణేష్ తదితరులు పాల్గొన్నారు.


ఉండవల్లిలో

ప్రజాశ క్తి- తాడేపల్లి : రాజధానిలో భాగమైన ఉండవల్లి, పెనుమాక గ్రామాల్లో శుక్రవారం నెల్లూరు నగరంలో మున్సిపల్ కార్మికులపై పోలీసులు జరిపిన అమానుష లాఠీచార్జిని తీవ్రంగా ఖండిస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందరరేగా సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం రవి ప్రసంగించారు.


తుళ్లూరులో

ప్రజాశక్తి - తుళ్లూరు: నెల్లూరులో గురువారం మున్సిపల్ పారిశుధ్య కార్మికులపై పోలీసుల లాఠీ చార్జ్, కార్మికుల అరెస్టులపై రాజధాని అమరావతిలో నిరసనలు పెల్లుబుకాయి. రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపులో భాగంగా శుక్రవారం రాజధాని లోని తుళ్లూరు, అనంతవరం, మందడం,వెలగపూడి ల పారిశుధ్య కార్మికులు నిరసనలు తెలిపారు. రాజధాని ఏరియా పారిశుధ్య కార్మిక సంఘం గౌరవ అధ్యక్షులు ఎం రవి తుళ్లూరులో మాట్లాడుతూ, మున్సిపల్ అధికారులకు అర్జీ ఇచ్చేందుకు వెళుతున్న మున్సిపల్ కార్మికులపై నెల్లూరు పోలీసులు అమానుషంగా లాఠీచార్జి చేసి మహిళా కార్మికులని గాయపరిచారని, 63 మంది కార్మికుల్ని అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లో నిరరేదించారని చెప్పారు .కార్మికులను అణిచివేయాలని చూస్తే కార్మిక వర్గం అంతా సంఘటితమై తగిన రీతిగా గుణపాఠం చెప్పి తీరుతారని రవి హెచ్చరించారు.


ఎర్రబాలెంలో

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్ : ఎర్రబాలెంలో ఎంటిఎంసి మున్సిపల్ కార్మికుల నిరసన కార్యక్రమంలో యూని యన్ గౌరవాధ్యక్షులు ఎం రవి ప్రసంగించారు. రాష్ట్ర యూనియన్ పిలుపుమేరకు ఎర్రబాలెం, నిడమర్రు, బేతపూడిలో కార్మికులు నిరసన తెలిపారు.


బహుమతులు అందచేస్తున్న హెచ్ఎం, అసోసియేషన్ ప్రతినిధులు

ఎపిఎంఎఫ్ ఆధ్వర్యంలో గణిత క్విజ్ పోటీలు

ప్రజాశక్తి-గుంటూరు : ఆంధ్రప్రదేశ్ గణిత ఫోరం ఆధ్వర్యంలో గుంటూరు పశ్చిమ మండలంలోని ఉపాధ్యాయులకు చేబ్రోలు మహాలక్ష్మమ్మ పుల్లయ్య ఉన్నత పాఠశాలలో జాతీయ గణిత దినోత్సవం సందర్భంగా క్విజ్ నిర్వహించారు. అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.ప్రసాద్ మాట్లాడుతూ గణితం నేర్చుకోవటం ద్వారా సమస్యలను పరిష్కరించే నైపుణ్యం, తార్కిక ఆలోచన శక్తి, విశ్లేషణాత్మక ఆలోచన వంటి నైపుణ్యాలు అలవడతాయన్నారు. క్విజ్లో మొదటి స్థానం చేబ్రోలు మహాలక్ష్మమ్మ పుల్లయ్య హైస్కూల్, ద్వితీయ స్థానం శారదా నికేతన్, తృతీయ స్థానం ఎస్ఆర్ఆర్ హైస్కూల్ సాధించగా, వారికి పాఠశాల హెచ్ఎం ఎన్.బి. తిలక్, ఘంటా లక్ష్మీనారాయణ బహుమతులు అంద ెజేశారు. కార్యక్రమంలో ఎపిఎంఎఫ్ ప్రతినిధులు ఎం.చిన్నయ్య, పి.సునీత, రజిని, బి.నరసింహారావు, ఎ.మధుసూదన్రావు, పి.జగదీష్, రమేష్ పాల్గొన్నారు. జలగం రామారావు పాఠ శాలలో నిర్వహించిన గుంటూరు తూర్పు మండలానికి సంబం ధించిన క్విజ్ పోటీలలో కాసు శాయమ్మ హైస్కూల్, ఎన్జిఎస్కె బాలికల హైస్కూల్, భారత్పేట జిఎంసి ఉన్నత పాఠశాల ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించాయి. వారికి హెచ్ఎం వేణుగోపాలరావు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో బి.శ్రీనివాసరావు, కె.జయలక్ష్మి, షేక్.జానీభాషా పాల్గొన్నారు.

జెన్ జెడ్ పోస్టాఫీస్‌గా విఐటి సబ్ పోస్టాఫీసు

ప్రజాశక్తి - తుళ్లూరు

గుంటూరు పోస్టల్ డివిజన్లో విట్ యూనివర్సిటీ సబ్ పోస్టాఫీసును ఆధునీకరణ చేసి జెన్ జెడ్ పోస్టాఫీసు చేయడం జరిగిందని పోస్టల్ సూపరింటెండెంట్ మధుర వాణి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోస్టాఫీసును శనివారం ఉదయం10 గంటలకు కేంద్ర గ్రామీణ అభివృద్ధి, కమ్యూనికేషన్ల శాఖ సహాయ మంత్రి డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ విట్ యూనివర్సిటీ క్యాంపస్ లో ప్రారంభిస్తారన్నారు. స్థానిక ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్ కుమార్, ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బి.పి శ్రీదేవి, తదితరులు పాల్గొంటారని తెలిపారు.

శారద సొసైటీకి డిఎంహెచ్ఓ అభినందన

ప్రజాశక్తి - తెనాలి

మహిళల ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు శారద సర్వీసెస్ సొసైటీ 'డోర్ టు డెస్టినేషన్' పేరిట చేపట్టిన సేవలను జిల్లా వైద్య ఆరోగ్యాధికారిణి డాక్టర్ విజయలక్ష్మి అభినందించారు. కార్యక్రమంలో భాగంగా శుక్రవారం బుర్రిపాలెం రోడ్డులోని బీసీ కాలనీలో నిర్వహించిన ఉమన్ హెల్త్ స్క్రీనింగ్లో ఆమె మాట్లాడారు. మహిళల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపించి లాభాపేక్ష లేకుండా నిర్వహిస్తున్న శారద సర్వీస్ సొసైటీ సేవలు అభినందనీయమన్నారు. ప్రోగ్రాం స్టేట్ నోడల్ ఆఫీసర్ శ్యామల మాట్లాడుతూ ఎన్సిడిఎస్ రుగ్మతలను గుర్తించి వారిని అప్రమత్తం చేసే దిశగా డాక్టర్ శారద చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రోగ్రాం ఆఫీసర్ రోహిణి, జిల్లా ఉప వైద్యాధికారిణి డాక్టర్ ఇ అన్నపూర్ణ, సిపిఓ ఝాన్సీ, సి రాఘవేంద్ర డాక్టర్ సురేష్ డాక్టర్ పాల్గొన్నారు.

నేరాల కట్టడికి డ్రోన్‌లతో నిఘా

ప్రజాశక్తి - పెదనందిపాడు : మండలంలో శాంతిభద్రతలు కాపాడడానికి కృషి చేస్తానని పెదనందిపాడు నూతన సబ్ ఇనస్పెక్టర్ చల్లా సత్యనారాయణ తెలియజేశారు. శుక్రవారం పోలీస్ స్టేషన్లో మీడియాతో మాట్లాడుతూ గుంటూరు నల్ల పాడు పోలీస్ స్టేషన్లో నూతనంగా ట్రైనింగ్ ముగించుకొని పెదనందిపాడుకు మొదటి పోస్టింగ్ లో వచ్చినట్లు తెలిపారు. డ్రోన్ గస్తీ ద్వారా నేరాలను అరికట్టడానికి పటిష్టంగా చర్యలు చేపడుతామని తెలిపారు. రాత్రి వేళల్లో అనవసరంగా రోడ్లమీద తిరగ రాదని, బహిరంగ మద్యపానం చేయ రాదని, డ్రంక్ అండ్ డ్రైవింగ్ చేస్తే కేసులు పెడతామని చెప్పారు. స్కూల్, కాలేజీల వద్ద సిగరెట్లు, గుట్కాలు వంటివి అమ్మడం నిషేధం అన్నారు. ఈ సందర్భంగా పలువురు ఎస్ఐను అభినందించారు.



విద్యుత్ పొదుపుపై ప్రతిజ్ఞ చేస్తున్న అధికారులు

విద్యుత్ అధికారుల రివ్యూ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల డివిజన్ కార్యాలయంలో విద్యుత్ అధికారులతో పల్నాడు జిల్లా సూపరింటెండింగ్ ఇంజనీర్ డా.పి.విజయ్ కుమార్ పల్నాడు వారు సీనియర్ అకౌంట్స్ బి.వెంకటేశ్వర్వర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్య సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో అగ్రికల్చర్ వర్క్స్, రెవెన్యూ కలెక్షన్స్, ఆర్‌డిడి వర్క్స్, పిఎం సూర్యఘర్ గురించి, రివ్యూ చేశారు. సమావేశానికి డివిజన్‌కు సంబంధించిన డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, అసిస్టెం ట్ అకౌంట్, జూనియర్ అకౌంట్స్ ఆఫీసర్స్ హాజరయ్యారు.



మొబైల్స్‌ను పంపిణీ చేసిన ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

అంగన్వాడీలకు మొబైల్ ఫోన్ల పంపిణీ

ప్రజాశక్తి - మాచర్ల

రాష్ట్ర మహిళా శిశు సంక్షేమం ద్వారా పారదర్శక సేవలను ప్రజలకు అందించేందుకు కూటమి ప్రభుత్వం అంగన్వాడీ కార్యకర్తలకు 5జీ మొబైల్స్‌ను అందజేస్తోందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అన్నారు. శుక్రవారం స్థానిక గుంటూరు రోడ్డులో ఉన్న స్వామి వివేకానంద మెడిటేషన్ భవనంలో మహిళా శిశు సంక్షేమ ఆధ్వర్యంలో జరిగిన మొబైల్స్ పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, టీచర్లకు మొబైల్స్‌ను అందజేశారు. జ్యోతి ప్రజ్వలన అనం తరం బాల్య వివాహాలకు నిర్మూలనను సామాజిక బాధ్యతగా తీసుకోవాలని అంగన్వాడీలతో ఎమ్మెల్యే ప్రతిజ్ఞ చేయించారు. బాల్య వివాహాలను రూపు మాపడానికి అంగన్వాడీలు తమవంతు పాత్ర పోషించాలని కోరారు.సీడీపీవో కృష్ణవేణి, సూపర్వైజర్లు జ్యోతి, అన్నపూర్ణ, దుర్గా, ఉమాదేవి, సామాజిక వేత్త గోవిందరెడ్డి, కూటమి పార్టీల నాయకులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే

ప్రజా సమస్యలపై నిర్లక్ష్యం వద్దు

ప్రజాశక్తి - మాచర్ల

ప్రజా సమస్యలపై అధికారులు నిర్లక్ష్యం వద్దని, వీలైనంత వేగంగా ఫర్యాదుదారులకు న్యాయం జరిగేలా చూడాలని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అధికారులకు సూచించారు. శుక్రవారం స్థానిక నెహ్రూనగర్ టీడీపీ కార్యాలయంలో జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో ఎమ్మెల్యే జూలకంటి పాల్గొని, ప్రజల నుంచి ఆర్జీలను స్వీకరించారు. ఆయన మాట్లా డుతూ, ప్రజా వినతులను కింది స్థాయిలోనే పరిష్కరించేందు కు అధికారులు చొరవ చూపాలన్నారు. ఎమ్మెల్యేకు నియోజక వర్గ స్థాయి ప్రజల 46అర్జీలు అందించగా, అందులో రెవిన్యూ, భూ వివాదాలు, నూతన పింఛన్లు వంటివి అర్జీలు ఎక్కువగా ఉన్నాయి. కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గోడౌన్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ కృతిక శుక్లా

కలెక్టర్‌చే ఈవీఎం గోడౌన్లు పరిశీలన

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

నరసరావుపేట మార్కెట్ యార్డు వద్ద ఉన్న ఈవీఎం గోడౌన్లను సాధారణ తనిఖీలలో భాగంగా రాజకీయ పార్టీ ప్రతినిధులతో కలిసి కలెక్టర్ కతికా శుక్లా పరిశీలించారు. ఎలక్ట్రానికి ఓటింగ్ మిషన్ల గోడౌన్‌ను కలెక్టర్ కృతికా శుక్లా తనిఖీ చేశారు. స్థానిక నరసరావుపేట మార్కెట్ యార్డ్ లోని ఈవిఎం యంత్రాలు, వివిప్యాడ్‌లు భద్రపరిచిన గోడౌన్ ను తనిఖీ చేశారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈవీఎం గోడౌన్ తనిఖిలో భాగం గా ఈవిఎం గోడౌన్‌కు వేసిన భద్రతా సీళ్లు, సిసి కెమెరాలు పని తీరు, అగ్నిమాపకదళ పరికరాలను పరిశీలించారు. అనంత´రం సెక్యూరిటీ లాగ్ బుక్‌ను పరిశీలించి అందులో సంతకం చేశారు. కలెక్టర్ వెంట జిల్లా రెవెన్యూ అధికారి మురళి, కలెక్టరేట్ ఎన్నికల విభాగం సిబ్బంది ఉన్నారు.

శిశు గృహాన్ని కలెక్టర్ సందర్శన

నరసరావుపేటలోని శిశు గృహాన్ని శుక్రవారం కలెక్టర్ కృత్తికా శుక్లా సందర్శించారు. శిశు గృహానికి సంబంధించి ఎంత మంది చిన్నారులు సంరక్షణలో ఉన్నారో అడిగి తెలుసుకున్నారు. అధికారుల విధులు, వారు అందిస్తున్న సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. చిన్నారుల్లో ఎంత మంది దత్తత స్వీకరణకు సిద్ధంగా ఉన్నారో తెలుసు కున్నారు. ఆహారం, వసతి, బట్టలు, చదువు అంశాలపై అధికారులతో మాట్లాడారు. చలికాలం కావడంతో వారికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు. సమస్యలు, అవసరాలు ఉంటే తమ దృష్టికి తీసుకు రావాలని కలెక్టర్ అన్నారు. ఆమె వెంట తహశీల్దార్ వేణుగోపాలరావు, జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఉమాదేవి, డిసిపిఓ సౌరీ రాజు అధికారులు బి. కృష్ణారెడ్డి, అరుణ, కుమారి ఉన్నారు.

హకతాన్ పోటీలలో విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి-పల్నాడు జిల్లా

స్మార్ట్ ఇండియా హకతాన్-2025లో జాతీయ స్థాయిలో విజయం సాధించిన నరసరావుపేట ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు జి..షణ్ముఖ, టి.నాగ కళ్యాణ్, కే.హర్షిత, కె.వి.సాయి భారత్, జి.చిన్మయి, కె.తన్మయిను కలెక్టర్ కృతికశుక్లా అభినందించారు. కేంద్ర ప్రభుత్వ విద్యా మంత్రిత్వ శాఖ నిర్వహించిన స్మార్ట్ ఇండియా హకతాన్ పోటీలలో నరసరావుపేట ఇంజినీరింగ్ కాలేజ్ (ఎన్.ఈ.సి) విద్యార్థుల బృందం జాతీయస్థాయిలో విజేతలుగా నిలిచి రూ.1.50 లక్షలు గెలుచుకున్నారు. పోటీలలో విద్యార్థులు భారతీయ సాంప్రదాయ నృత్య ముద్రలను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్సీతో అనుసంధానించిన తీరు అందరిని ఆకట్టుకుంది. కార్యక్రమంలో కళాశాల ఐటి విభా గాధిపతి, కన్వీనర్ డాక్టర్ బి.ఝాన్సీ వజ్రం, డాక్టర్ కె.అనిల్ కుమార్ విద్యార్థులను అభినందించారు. కళాశాల చైర్మన్ మిట్టపల్లి వెంకట కోటేశ్వరరావు , వైస్ చైర్మన్ మిట్టపల్లి చక్రవర్తి , సెక్రటరీ, కరెస్పాండంట్ మిట్టపల్లి రమేష్ బాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. వెంకటేశ్వర్లు విజేతల బృందాన్ని అభినందించారు.

మొక్కజొన్న పొలాలను పరిశీలన

ప్రజాశక్తి - బొల్లాపల్లి

మండలంలోని కొచ్చర్ల గ్రామంలో గడ్డి మందు ప్రభావంతో ఎండిన మొక్కజొన్న మొక్కలను కీటక శాస్త్రవేత్త ఎన్ సాంబశివరావు, మొక్కజొన్న శాస్త్రవేత్త సివి చంద్ర మోహన్ రెడ్డి, వినుకొండ ఏడిఏ సిహెచ్ రవికుమార్ శుక్రవారం పరిశీలించారు. రైతులు వినియోగించిన గడ్డి మందును పరిశీలించి ఆ మందు వాడకూడదన్నారు. వ్యవసాయా ధికారుల సూచనల మేరకే మందు లను పిచికారి చేయాలన్నారు. మొక్క కోలుకోవాలంటే పొలంలో నీళ్ల తడి ఆరకుండా ఉండేలా చూసుకోవాలని అదే సమయంలో ట్యాంక్‌కు రెండు శాతం యూరియా ద్రావణాన్ని పిచికారి చేయాలన్నారు. రెండో దఫా ఎకరా నికి మల్టీకే కిలో, ఎమినో యాసిడ్స్ లీటర్ నీటికి 3 ఎంఎల్ నుండి 5 ఎంఎల్ పిచికారి చేయడం ద్వారా ప్రయోజనం ఉంటుందని రైతులకు సూచించగా వాటిని వాడినా ప్రయోజనం లేదని రైతులు వాపోయారు. గ్రామంలో 20 మంది రైతులు గడ్డి మందు ప్రభావంతో సుమారు 70 ఎకరాలలో పంటను నష్టపోయామని ఎకరాకు రూ. 20వేల వరకు ఖర్చు చేశామని తెలిపారు. నష్టపరిహారం ఇప్పించి ఆదుకోవాలని అధికారులను కోరారు. వారితోపాటు ఏఓ రామారావు,గ్రామ వ్యవసాయ సహాయకులు ఉన్నారు.

21న ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-చిలకలూరిపేట

పేదల ఆరోగ్య రక్షణకు ప్రత్తిపాటి ఫౌండేషన్ ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారా వు అన్నారు. శుక్రవారం తన నివాసంలో ఆయన మాట్లాడుతూ పురుషోత్తమపట్నంలోని శ్రీ షిరిడీసాయి మందిర ప్రాంగణంలో ఈనెల 21వ తేదీన నిర్వహించే ఉచిత వైద్య శిబిరాన్ని నియోజకవర్గ ప్రజలు సద్వినియోగం చేసుకోవాల న్నారు. శంకర కంటి ఆసుపత్రి, రమేశ్ హాస్పిటల్స్‌కు చెందిన అనుభవజ్ఞులైన వైద్యసిబ్బంది పాల్గొంటారని తెలిపారు.

మహాగణపతి వార్షికోత్సవం

ప్రజాశక్తి - గురజాల

గురజాలలో శ్రీ పాత పాట ఐశ్వర్య అమ్మవారి ఆలయ ప్రాంగణంలో మహాగణపతి ప్రతిష్ట ఆరవ సంవత్సరం సందర్భంగా శుక్రవారం మహా అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. భక్తులు వేల సంఖ్యలో పాల్గొన్నారు. సీఐ భాస్కర్ బందోబస్తు ఏర్పాటు చేశారు.

రసాబాసగా గ్రామసభ

ప్రజాశక్తి - గురజాల

గురజాల నగర పంచాయతీ నుంచి జంగమహేశ్వరపురాన్ని విడదీయాలనే విషయంపై కమిషనర్ శివన్నారాయణ ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేశారు. గ్రామ సభలో ఎంపీడీవో, ఎమ్మార్వో డిఎల్పిఓ పాల్గొన్నారు ప్రజాభిప్రాయ సేకరణ నిమిత్తం గ్రామసభ ఏర్పాటు చేయడం జరిగింది కొంత వరకు సజావుగా జరిగిన గ్రామసభ కొంతమంది గ్రామస్తులు వలన రసాభాసగా మారడంతో అర్ధాంతరంగా గ్రామసభని నిలిపి వేశారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోండి

ప్రజాశక్తి - బెల్లంకొండ

ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యాన్ని విక్రయించుకొని సద్వినియోగం చేసుకోవాలని మండల డిఆర్డిఏ ఏపీఎం ఉషశ్రీ తెలిపారు.స్థానిక వెలుగు కార్యాలయంలో శుక్రవారం మాట్లాడుతూ మండలంలోని నాగిరెడ్డి పాలెం గ్రామంలోని రైతు సేవా కేంద్రంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రైతులు దళారుల నుంచి మోసపోకుండా ఉండడానికి ఈ కేంద్రాలు ఎంత కూడా ఉపయోగపడతాయని ధాన్యం నూర్పులు పూర్తయిన వెంటనే రైతుసేవా కేంద్రానికి తీసుకువచ్చి సిబ్బంది సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో డిఆర్డిఏ సిసి సైదా వెలుగు వివో ఏ రమాదేవి మండల కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పెన్షనర్స్ హోమ్‌కి సోఫాలు వితరణ

ప్రజాశక్తి - మాచర్ల రూరల్

మాచర్ల స్టేట్ బ్యాంకు వారు మాచర్ల పెన్షనర్స్ హోమ్ వారికి సోఫా సెట్లు అందించారు. పెన్షన్ డే సందర్భంగా 60 సంవత్సరాలు దాటిన వయోవద్ధులకు కూర్చోవడానికి కొంత సమయం స్వేద తీర్చుకోవటానికి ఉపయోగకరంగా ఉంటుందని స్థానిక బ్రాంచ్ మేనేజర్ సతీష్ కుమార్ ఈ సందర్భంగా తెలియజేశారు. కార్యక్రమంలో స్థానిక ఎస్బిఐ సిబ్బంది అసిస్టెంట్ మేనేజర్ షేక్ రబ్బాని, పున్నారావు, అరుణ్ కుమార్, పెన్షన్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గాదే రామకష్ణారావు, జక్కి రెడ్డి మరెడ్డి, షేక్ గౌస్ మొహిద్దిన్, గాదే కిరీటిరెడ్డి, షేక్ గాలిబ్ సాహెబ్, సాధనాల నరసయ్య, అందుగుల చంద్రయ్య, ముత్యాలపాపిరెడ్డి, లక్ష్మయ్య పాల్గొన్నారు.



సోఫా సెట్ అందిస్తున్న ఎస్‌బిఐ అధికారులు



విద్యార్థులతో నరేంద్ర సువర్ణకుమారి

వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన

ప్రజాశక్తి - యడ్లపాడు

వ్యక్తిగత పరిశుభ్రత మంచి అలవాట్లపై నరేంద్ర సువర్ణ కుమారి ఫౌండేషన్ అధ్యక్షురాలు ఎడ్లపాడు మండలంలోని ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో వ్యక్తిగత శుభ్రత, మంచి అలవాట్లపై అవగాహన కల్పించారు. అనంతరం విద్యార్థులను ప్రశ్నించగా వారు చురుగ్గా సమాధానం చెప్పారు. ప్రోత్సాహకరంగా వీరికి పెన్నులు బలపాలు బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఫౌండేషన్ అధ్యక్షురాలు నరేంద్ర సువర్ణ కుమారి ఉపాధ్యక్షుడు వై.ప్రసాదరావు పాల్గొన్నారు.

జాతీయ ఇంధన పొదుపు వారోత్సవాలు

ప్రజాశక్తి - మాచర్ల

ఇంధన పొదుపు పాటించి భవిష్యత్ తరాలకు వెలుగునిద్దామని అందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని విద్యుత్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఎన్. సింగయ్య కోరారు. జాతీయ ఇందన పొదుపు వారోత్సవాలలో భాగంగా స్థానిక విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో విద్యుత్ కార్యాలయం నుండి రింగ్ రోడ్డు నుంచి అంబేద్కర్ సెంటర్ మీదగా బస్టాండ్ సెంటర్ వరకు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్లకార్డులు చేతబూని, ఇంధన పొదుపు పై అవగాహన కల్పిస్తూ, ప్రతిజ్ఞ చేశారు. ఎన్.సింగయ్య మాట్లాడుతూ విద్యుత్ పొదుపు ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలన్నారు. స్టార్ రేటింగ్ ఉన్న విద్యుత్ వస్తువులు వాడటం ద్వారా పొదుపు చేయవచ్చునన్నారు.

ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రజాదర్బార్

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి కార్యాలయంలో ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ ప్రజాదర్బార్ శుక్రవారం నిర్వహించారు ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై వినతి పత్రాలు అందించారు. ప్రజల నుంచి నేరుగా ఫిర్యాదులను ఎమ్మెల్యే స్వీకరించారు. ప్రతి ఒక్కరి విజ్ఞప్తిని పరిశీలించి సత్వర పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.




నివాళి అర్పిస్తున్న ఎమ్మెల్యే బ్రహ్మానందరెడ్డి

వీరారెడ్డికి ఎమ్మెల్యే నివాళి

ప్రజాశక్తి - వెల్దుర్తి

మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకులు తెల్లూరి వీరారెడ్డి అనారోగ్యంతో మృతి చెందారు.విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి శుక్రవారం గ్రామానికి వెళ్లి వీరారెడ్డి పార్థివ దేహానికి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఆయన వెంట మాచర్ల మండల కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్ కుటుంబరావు

రేషన్ డీలర్లతో సమావేశం

ప్రజాశక్తి - నాదెండ్ల

మండల పరిధిలోని రేషన్ డీలర్లతో తహశీల్దార్ వైవిబి కుటుంబరావు శుక్రవారం సమాశాన్ని నిర్వహించారు. దుకాణాల వారీగా ప్రస్తుతం ఉన్న నిల్వాల గురించి అడిగి తెలుసుకున్నారు. సకాలంలో రేషన్ పంపిణీ చేయాల న్నారు. సాంకేతిక సమస్యలతో పాటుగా, ఇతర సమస్యలుంటే వెంటనే తమకు తెలియజేయాలని కోరారు. క్షేత్ర స్థాయిలో రేషన్ పంపిణీ సజావుగా జరిగేలా ముందస్తు ప్రణాళికతో ఉండాలన్నారు. డీలర్లు, అసిస్టెంట్ మొయిజు పాల్గొన్నారు.

ధాన్యాన్ని దళారులకు అమ్మి మోసపోవద్దు

ప్రజాశక్తి - చేబ్రోలు

రైతులు ధాన్యిన్ని దళారీలకు అమ్మి మోసపోవద్దని తహశీల్దార్ కె.శ్రీనివాసశర్మ సూచించారు. మండలంలోని వేజెండ్ల గ్రామంలో తహశీల్దార్, మండల వ్యవసాయ అధికారి పి.ప్రియదర్శిని పర్యటించారు. రైతులు ధాన్యాన్ని కళ్లాల్లో నుంచి మట్టి రాళ్లు, చెత్త, చెడిపోయిన ధాన్యం శుభ్రం చేసుకోవాలని రైతులకు సూచించారు. వేజెండ్ల రైతు సోదరులు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

బాలలపై హింస, వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - తాడికొండ

బాలలపై హింస, వేధింపులు ఆపాలని సీడీపీఓ అనురాధ అన్నారు. మండలంలోని రావెల గ్రామ జిల్లా ఉన్నత పాఠశాల నందు శుక్రవారం చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్-క్రాఫ్ ఆధ్వర్యంలో బాలలపై హింస వేధింపులు నివారణ లో బాలల పాత్రపై బాలల సంబంధిత కమిటీ సభ్యులతో చర్చ గోష్టి కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ గ్రామాలలో బాల్య వివాహాలు జరగకుండా చూడవలసిన బాధ్యత అందరిపై ఉందని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ సి.హెచ్. వెంకటేశ్వరమ్మ, డాక్టర్ ఎం.లత, ప్రధానోపాధ్యాయులు, జె.అంజలి దేవి, క్రాఫ్ ట్రైనింగ్ కో-ఆర్డినేటర్ సి.హెచ్ ప్రభాకర్, జి.వెంకట్, సీతారావమ్మ, అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

కృత్రిమ మేధస్సుతో రసాయనాల పిచికారి

ప్రజాశక్తి - తాడికొండ

కృత్రిమ మేధస్సు ద్వారా పంటలలో కలుపు మొక్కలను, పురుగులను గుర్తించి వాటిపైన మాత్రమే రసాయనాలు పిచికారి చేసే పరిజ్ఞానం మనకు త్వరలో అందుబాటులోకి రానున్నదని గ్లోబల్ ఫుడ్ సెంస్ ఇనిస్టిట్యూట్, యూనివర్సిటీ అఫ్ ఫ్లోరిడా డాక్టర్ గోపాల కాకాని అన్నారు. ఆచార్య ఎన్ జి రంగ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో విశ్వవిద్యాలయంలో శుక్రవారం బిల్డింగ్ ఆన్ ఏఐ యూనివర్సిటీ ఏఐ ఫర్ అగ్రికల్చర్ అనే అంశంపై చర్చ కార్యక్రమం నిర్వహించారు ఈ సందర్భంగా గోపాల్ మాట్లాడుతూ ఫ్లోరిడా, భారతదేశ వాతావరణ పరిస్థితులు ఒకేవిధంగా ఉండటం వలన క అత్రిమ మేదస్సుపై చేసిన పరిశోధనలను ఆంధ్ర ప్రదేశ్లో పరిశిలించి ఆచరణలో పెట్టవచ్చు అని అన్నారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ అఫ్ రీసెర్చ్ పి.వి. సత్యనారాయణ ఇంజనీరింగ్ & టెక్నాలజీ డాక్టర్ ఎ.మణి, డీన్ అఫ్ పిజి స్టడీస్, డాక్టర్ ఎ.వి.రమణ, కంట్రోలైర్ డాక్టర్ బి.వి.ఎస్. ప్రసాద్, డీన్ అఫ్ కమ్యూనిటీ సైన్సు డాక్టర్ పి.సాంబశివరావు, ఎస్టేట్ ఆఫీసర్. పి.రవి యూనివర్సిటీ లైబ్రేరియన్ డాక్టర్ జి.కరుణ సాగర్, భోధన సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.



స్నాతకోత్సవంలో పాల్గొన్న కళాశాల అధిపతులు

అట్టహాసంగా సిబార్ కళాశాల 21వ స్నాతకోత్సవం

ప్రజాశక్తి - పెదకాకాని

మండల పరిధిలోని తక్కెళ్ళపాడు గ్రామంలో గల సిబార్ దంత వైద్య కళాశాలలో శుక్రవారం అట్టహాసంగా 21వ నాతకోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి.కళాశాల స్థాపించి 25 సంవత్సరాలు పూర్తిచేసుకుని రజతోత్సవ వేడుకలు జరుపుకుంటున్న సందర్భంగా ఈ కార్యక్రమం ఎంతో ప్రాముఖ్యాన్ని సంతరించుకుంది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్ఆర్ఎం అమరావతి యూనివర్సిటీ ఉపకులపతి ప్రొఫెసర్ సి.హెచ్.సతీష్ కుమార్, గౌరవ అతిథులుగా అమెరికాలోని రట్జర్స్ యూనివర్సిటీ డెంటల్ స్కూల్లో ఓరల్ డయాగ్నొస్టిక్స్ విభాగ అధిపతి డాక్టర్ స్టీవెన్ ఆర్ సింగర్ మరియు భారత దంత వైద్య మండలి మెంబర్ డాక్టర్ పి.రేవతి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్, డైరెక్టర్ డాక్టర్ టి.కృష్ణమోహన్, ఎల్. ప్రణీత్, ప్రిన్సిపల్ డాక్టర్ వెంకటరమణారెడ్డి, వైస్ డీన్ డాక్టర్ మన్నే ప్రకాష్ మరియు డాక్టర్ బొల్లా నగేష్, కళాశాలలోని వివిధ విభాగాధిపతులు వేదికను అలంకరించారు. తొలుత కళాశాల డీన్ డాక్టర్ ఎల్.కృష్ణప్రసాద్ సభను ఉద్దేశించి మాట్లాడుతూ ఈ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులకు దంత వైద్యంలో ఉన్నతమైన విధివిధానాలు నేర్చుకొనుటకై అవసరం అయిన అన్ని అత్యాధునిక సౌకర్యములు కల్పించడం జరిగినదని చెప్పారు. కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ రమణారెడ్డి, గౌరవ అతిథులు డాక్టర్ స్టీవెన్ ఆర్ సింగం, డాక్టర్ పి.రేవతి వైస్ ఛాన్సర్ డాక్టర్ సిహెచ్ సతీష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుల్స్‌గా ఎంపికైన పూర్వ విద్యార్థులకు సన్మానం

ప్రజాశక్తి - పెదనందిపాడు



పూర్వ విద్యార్థులను సత్కరిస్తున్న కళాశాల పాలకవర్గం

పి.ఎ.ఎస్ కళాశాల పూర్వ విద్యార్థులు, ఎన్‌సిసి క్యాడెట్స్ ప్రభుత్వ పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన సందర్భంగా శుక్రవారం వారిని కళాశాల పాలకవర్గ జాయింట్ సెక్రటరీ నర్రా బాలకృష్ణ, పాలకవర్గ సభ్యులు నర్రా వీరయ్య, పి.ఈ.డి సొసైటీ పాలకవర్గం తరుపున ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్‌సిసి అనేది కేవలం శిక్షణ కాదు క్రమశిక్షణ, దేశభక్తి, సేవాభావం, నాయకత్వ లక్షణాలు అలవడతాయన్నారు. ప్రస్తుతం పోలీస్ కానిస్టేబుల్స్ గా ఉద్యోగాలు సాధించిన కుమారి పి.నవీనా, షేక్ కాలేషావలి, షేక్. రఫీ, పి.ప్రసాద్, వై.అనిల్‌లను కళాశాల తరపున అభినందించారు. కళాశాల పాలకవర్గ అధ్యక్షులు, విజిలెన్స్ మాజీ డిఎస్పి కాళహస్తి సత్యనారాయణ, సెక్రటరీ & కరెస్పాండంట్ డాక్టర్ లావు రత్తయ్య, ట్రెజరర్ లావు ఆదిశేషయ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ గుర్రం వీర రాఘవయ్య, కళాశాల ఎన్‌సిపి ఆఫీసర్ డాక్టర్ పాతూరి శ్రీనివాస్ అభ్యర్థులను అభినందించారు. ఈ కార్యక్రమములో కళాశాల అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది మరియు విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

మాదకద్రవ్యాల నిర్మూలన పోరాటానికి ప్రతిఒక్కరూ సిద్ధం కావాలి



మాట్లాడుతున్న ఎస్ఐ ప్రసాద్

ప్రజాశక్తి - కొల్లిపర

మాదక ద్రవ్యాలపై పోరాటానికి ప్రతి ఒక్కరూ సిద్ధం కావాలని ఎస్ఐ ప్రసాద్ తెలిపారు. శుక్రవారం స్థానిక అవుతు రామిరెడ్డి జూనియర్ కళాశాలలో సంకల్పం అనే ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. ఎస్ఐ మాట్లాడుతూ విద్యార్థులకు మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే ప్రమాదాలు, దుష్ప్రభావాలపై సమగ్ర అవగాహన కల్పించారు. మాదక ద్రవ్యాలకు బానిసలైనవారిని గుర్తించి వారిని డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్లకు పంపించి అవసరమైన చికిత్స కౌన్సిలింగ్ అందించే చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఈ "సంకల్పం" కార్యక్రమంతో అవగాహన కార్యక్రమాలను మరింత విస్త అతం చేస్తామని ఎస్ఐ తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ పిల్లలందరి చేత డ్రగ్స్ లేని సమాజానికి దారి చూపుతామని ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ ప్రసాదరావు, సిబ్బంది, కాలేజీ ప్రిన్సిపాల్ రాఘవ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీఎం చంద్రబాబు చిత్రపటానికి పాలాభిషేకం

ప్రజాశక్తి - మంగళగిరి



పాలాభిషేకం చేస్తున్న నాయకుల

మంగళగిరి తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో విజయవాడ నుండి హజ్ యాత్రకు వెళ్లే యాత్రికులకు ప్రభుత్వం ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఆర్థిక సాయం మంజూరు చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హజ్ కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చిత్రపటానికి ముస్లింలు శుక్రవారం పాలాభిషేకం నిర్వహించి స్వీట్లు పంపిణీ చేశారు. ముఖ్యఅతిథిగా రాష్ట్ర హజ్ కమిటీ చైర్మన్ హాసన్ బాషా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో హజ్ కమిటీ డైరెక్టర్ షేక్ జబిన్, రాష్ట్ర ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మొహమ్మద్ ఇబ్రహీం, నియోజకవర్గ తెలుగు యువత ఉపాధ్యక్షుడు మహమ్మద్ అరిఫ్, టీడీపీ మైనారిటీ నాయకులు నిజాముద్దీన్, షేక్ నాగుల్ మీరా, గల్ఫ్ సుభాని, చాంద్ బాషా, జమ్ముల శ్రీనివాసరావు, సమీరా, ఎంజే సాధిక్ ఆదం మేస్త్రి తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌విఐటిలో ఘనంగా డిప్లమో స్టూడెంట్స్ ఫ్రెషర్స్ డే

ప్రజాశక్తి - చేబ్రోలు

స్థానిక ఆర్‌విఐటి ఇంజనీరింగ్ కళాశాలలో ఫ్రెషర్స్ డే సెలబ్రేషన్స్ ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంను కళాశాల చైర్మన్ ఆర్.వి.కృష్ణయ్య , డిప్లమా ప్రిన్సిపాల్, డి శ్రీధర్, అధ్యాపకులతో కలిసి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. అనంతరం చైర్మన్ కృష్ణయ్య మాట్లాడుతూ ఫ్రెషర్స్ డే కార్యక్రమంనూతన విద్యార్థులకు కళాశాలలో ఆహ్లాద వాతావరణాన్ని పరిచయం చేస్తూ, సీనియర్లు మరియు జూనియర్లు ఒకే వేదికపై కలిసిపోయే మంచి కార్యక్రమం అన్నారు. సాంకేతిక విద్యలో విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు ఒక మంచి మార్గం అన్నారు. డిప్లమా ప్రిన్సిపల్ డి.శ్రీధర్ మాట్లాడుతూ విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపి క్రమశిక్షణతో చదివి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ అచ్చిబాబు పట్టాభి , డిప్లమా ఆన్‌చార్జి షేక్ లాల్ జాన్ బాషా, విద్యార్థినీ విద్యార్థులు కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నెహ్రూ నికేతన్‌లో స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్

ప్రజాశక్తి - తెనాలి

స్థానిక బోస్ రోడ్డులోని నెహ్రూ నికేతన్ ఇంగ్లీష్ మీడియం స్కూల్లో శుక్రవారం స్టూడెంట్ లెడ్ కాన్ఫరెన్స్ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల మేనేజింగ్ డైరెక్టర్ మురళీకాంత్ దాసరి పర్యవేక్షణలో నిర్వహించిన కార్యక్రమంలో పట్టణ వన్ టౌన్ సిఐ మల్లికార్జునరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ట్రాఫిక్ సేఫ్టీ, పొల్యూషన్ కంట్రోల్ అంశాలపై విద్యార్థులు నిర్వహించిన ర్యాలీని ఆయన ప్రారంభించారు. పర్యావరణ పరిరక్షణపై విద్యార్థులకు అవగాహన కల్పించి, అదే విషయాన్ని సమాజంలోకి తీసుకువెళ్లేందుకు పాఠశాల తరఫున నిర్వహిస్తున్న కార్యక్రమాలు అభినందనీయం ఉన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించి శివాజీ చౌక్ కూడలిలో ఫ్లాష్ మాబ్ ప్రదర్శించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ సిఐ బ్రహ్మయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి : సిపిఎం

ప్రజాశక్తి - మంగళగిరి

పట్టణంలోని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ప్రభుత్వం ఇవ్వాలని సిపిఎం గుంటూరు జిల్లా నాయకులు ఎస్.ఎస్.చెంగయ్య కోరారు. శుక్రవారం నాలుగో వార్డ్ లో సిపిఎం విస్తృత సమావేశం సిపిఎం పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు ఎం.బాలాజీ అధ్యక్షతన నిర్వహించారు. సమావేశంలో చెంగయ్య మాట్లాడుతూ పట్టణంలో ఇళ్ల స్థలం లేని నిరుపేదలు వేలాదిమంది ఉన్నారని, వారందరికీ ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. ఈనెల 31వ తేదీ నుండి జనవరి 4వ తేదీ వరకు విశాఖపట్నంలో జరిగే సిఐటియు మహాసభలను జయప్రదం చేయాలని, చివరిరోజు బహిరంగ సభ, ర్యాలీకి అన్ని రంగాల కార్మికులు తరలిరావాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక సిపిఎం నాయకులు జె.మహాలక్ష్మి, ఈగ సాంబయ్య, ఆర్.వేణు తదితరులు పాల్గొన్నారు.



దీక్షల్లో పాల్గొన్న కార్మికులు

381వ రోజుకు చేరిన కార్మికుల దీక్షలు

ప్రజాశక్తి- తాడేపల్లి

చట్టపరంగా తమకు రావలసిన బకాయిల కోసం ఎసిసి సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికులు చేస్తున్న దీక్షలు శుక్రవారం నాటికి 381 వ రోజుకు చేరుకున్నాయి. దీక్షలు కార్మిక నాయకులు కూరపాటి స్టీవెన్, బూరగ అంకయ్య, షేక్ సుభాని, తుపాకుల నాగేశ్వరావు, ప్రారంభించారు. దీక్షల్లో షేక్ ఈమాంభి, ఈధులముడి శరమ్మా, వె.రమాదేవి, వేమురిబ్యా, దర్శి మల్లేశ్వరి కూర్చున్నారు. కార్యక్రమంలో మహిళలు డి.సువర్ణ, వి.లక్ష్మి, కార్మికులు ఎం.ఆశీర్వాదం, సుబ్బారావు, వై.యహెూషువ, పిచ్చయ్య, ఆర్.ఇశ్రాయిల్, డి.నాగేశ్వరావు, వై.సాంబశివరావు, బి.సూర్యప్రకాష్ పాల్గొన్నారు.

విమర్శిస్తే కేసులు పెడతారా

ప్రజాశక్తి - తాడేపల్లి

ప్రజలకు వ్యతిరేకమైన ప్రభుత్వ విధానాలను విమర్శించే హక్కు ప్రజాస్వామ్యంలో ఎవరికైనా ఉందని, కేవలం విమర్శించినందు వల్లే వైసీపీ కార్యకర్తలపై కేసులు పెడుతున్నారని మాజీ ఎంపీ గోరంట్ల మాధవ్ ప్రభుత్వాన్ని విమర్శించారు. శుక్రవారం అధికార ప్రతినిధి వై.నాగార్జునతో కలిసి తాడేపల్లి పోలీస్ స్టేషన్కు విచారణ కోసం వచ్చారు. విలేకరులతో మాట్లాడుతూ తాము ఇచ్చిన ఫిర్యాదులు పోలీసులు స్వీకరించడం లేదని అసంతృప్తి వ్యక్తం చేశారు. మేము ఇచ్చే ఫిర్యాదులు స్వీకరించే దమ్ము పోలీసులు ఉందా అని ప్రశ్నించారు. టిడిపి ప్రభుత్వం వెనకబడిన వర్గాలపై జరుపుతున్న దాడిగా దీన్ని భావిస్తున్నట్టు ఆయన చెప్పారు.



అన్నదానం చేస్తున్న సాంబశివరావు

కాశి అన్నపూర్ణేశ్వరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అన్నదానం

ప్రజాశక్తి - మంగళగిరి

స్థానిక వద్ద గల పానకాల లక్ష్మీ నరసింహ స్వామి వారి దేవస్థానం మెట్ల మార్గం దగ్గర శ్రీ కాశీ అన్నపూర్ణేశ్వరి సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం శుక్రవారం జరిగింది. ట్రస్ట్ చైర్మన్ పందేటి సాంబశివరావు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పుప్పాల సత్యనారాయణ, కర్నాటి శివ సత్యనారాయణ, పెరుమాళ్ళ సుబ్రహ్మణ్యం, ముద్రబోయిన శ్రీనివాసరావు, కోదాటి శ్రీనివాసరావు, ఖగ్గ శ్రీనివాసరావు, ఆలూరి ఉమామహేశ్వర రావు, శివప్రసాద్ శ్రీహరి, మురారి, దుంపల సోములు నంగళం ప్రసాద్, పేరు బోయిన వెంకటేశ్వరరావు, అన్నపురెడ్డి రామకృష్ణారెడ్డి, సిహెచ్.రంగారావు గండికోట వీర రాఘవులు, గండికోట అచ్చయ్య, బాపనపల్లి తాండవ, ఆకురాతి శంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

పోలియో నిర్మూలనకు సహకరించాలి

ప్రజాశక్తి - కొల్లిపర

పోలియో నిర్మూలనకు ప్రతి ఒక్కరూ సహకరించాలని మండల పరిషత్ అధ్యక్షురాలు భీమవరపు పద్మావతి అన్నారు శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో పోలియో నిర్మూలన గోడ పత్రికను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మున్నంగి పిహెచ్సి డాక్టర్ నేహా రెడ్డి మాట్లాడారు. చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విజయలక్ష్మి, తహశీల్ధార్ సిద్ధార్థ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కార్యక్రమంలో పాల్గొన్న అతిథులు

ఫొటో 7 : కార్యక్రమంలో పాల్గన్న అతిథులు

కిట్స్‌లో ముగిసిన ఉపాధ్యాయుల బూట్ క్యాంప్

ప్రజాశక్తి - గుంటూరు

ఉపాధ్యాయులలో నవీనత, డిజైన్ ఆలోచన, పారిశ్రామిక నైపుణ్యాలను పెంపొందించే ఉదేశంతో ఎఐసిటిఇ, విద్యా మంత్రిత్వ శాఖ ఇన్నోవేషన్ సెల్‌తో కలిసి కిట్స్ ఇంజినీరింగ్ కాలేజిలో నిర్వహించిన జాతీయస్థాయి ఐడిఇ బ్యూట్ క్యాంప్ శుక్రవారం ముగిసింది. ఈ క్యాంప్‌లో ఏలూరు, కృష్ణా, ఎన్‌టిఆర్, గుంటూరు, పల్నాడు జిల్లాల నుండి పిఎంశ్రీ పాఠశాలల ఉపాధ్యాయులు 170 మంది పాల్గొన్నారు. జిల్లా విద్యాశాఖ అధికారి షేక్ సలీం భాషా పాల్గని ప్రసంగించారు. ఈ బూట్ క్యాంప్ ఉపాధ్యాయులలో సాంకేతిక నైపుణ్యాలను బలోపేతం చేస్తుందని చెప్పారు. కిట్స్ కాలేజి ఛైర్మన్ డాక్టర్ కె.సుబ్బారావు ఉపాధ్యాయులకు, రిసోర్స్ పర్సన్‌లకు అభినందనలు తెలిపారు. తమ కాలేజిని నోడల్ సెంటర్‌గా ఎంపిక చేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో సెక్రెటరీ కె.శేఖర్, డైరెక్టర్ డాక్టర్ హరిబాబు, ప్రిన్సిపాల్ డాక్టర్ పి.బాబు, డాక్టర్ అరుణ తదితరులు పాల్గొన్నారు.

ఈడీ తీరుపై కాంగ్రెస్ నిరసన

ప్రజాశక్తి - గుంటూరు జిల్లా ప్రతినిధి


నిరసన తెలుపుతున్న కాంగ్రెస్ నాయకులు

నేషనల్ హెరాల్డ్ కేసులో కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ , రాహుల్ గాంధీపై సీబీఐ, ఈడి అక్రమంగా కేసులు నమోదు చేసి వేధిస్తున్నారని కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నగరంపాలెం జిఎస్‌టి కార్యాలయం వద్ద కాంగ్రెస్ నేతలు నిరసన తెలిపారు. సుదీర్ఘకాలం విచారించి ఈడి దాఖలు చేసిన ఛార్జీషీటును ఢిల్లీ రౌస్ అవెన్యూ కోర్టు స్పష్టంగా తిరస్కరించిన నేపథ్యంలో కాంగ్రెస్ నాయకులు హర్షం ప్రకటించారు. సత్యమేవ జయతే నినాదంతో కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా జిఎస్‌టి కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మహాత్మా గాంధీ పేరున ఉన్నా జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పేరు బొమ్మ మార్చడం యావత్ దేశాన్నే అవమానిచ్చినట్లుగా ఉందన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి, ఆఫీస్ ఇన్‌చార్జి బిళ్ళా సునీల్, పార్టీ నాయకులు బి. బ్రాహ్మయ్య, షేక్ ఇంతియాజ్, ఆర్.హనుమంత్ రావు, యాన్నమ్ సుధీర్, సేవాదళ్ నాయకులు సుబ్రహ్మణ్యం, కంతేటి ఎలమందరం, కావూరి పరిశుద్ధ రావు, అందె దిలీప్ పాల్గొన్నారు.

కోల్డ్‌స్టోరేజ్ అసోసియేషన్ కార్యవర్గం ఎన్నిక

ప్రజాశక్తి - గుంటూరు



అధ్యక్షులు సురేంద్రబాబు, కార్యదర్శి రాఘవయ్య

ది గుంటూర్ డిస్ట్రిక్ట్ కోల్డ్ స్టోరేజ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ 2025-27 కాలానికి నూతన కార్యవర్గాన్ని స్థానిక హౌసింగ్ బోర్డ్ కాలనీలోని అసోసియేషన్ కార్యాలయంలో శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షులుగా ఎస్.వి. కోల్డ్ స్టోరేజ్ పి.సురేంద్రబాబు, కార్యదర్శిగా శ్రీమంజునాథ కోల్డ్‌స్టోరేజ్ కేఎస్ రాఘవయ్య, కోశాధికారిగా చైతన్య కోల్డ్ స్టోరేజ్ ఆర్.వెంకటేశ్వర్లు, సహాయ కోశాధికారిగా కె.అశోక్‌కుమార్, కార్యవర్గ సభ్యులుగా వి.వెలుగొండరెడ్డి, జుగరాజ్ బండారి, మర్రెడ్డి శ్రీనివాసరెడ్డి, టి.గోపాలరావు, మానం శ్రీనివాస్‌రెడ్డి, బి.పేరయ్య, ఏ.సుబ్బారావు, శ్రీపాల్ బండారిలు ఎన్నికయ్యారు.

సాంకేతిక పరిశోధనలే దేశాభివృద్ధికి పునాది

ప్రజాశక్తి - గుంటూరు


సిడి ఆవిష్కరిస్తున్న అతిథులు

వీఎల్‌ఎస్ఐ, సిగ్నల్ ప్రాసెసింగ్, కమ్యూనికేషన్స్ రంగాల్లో జరుగుతున్న పరిశోధనలే భవిష్యత్ సాంకేతిక విప్లవానికి పునాదిగా నిలుస్తాయని ఐఐటీడీఎం కాంచీపురం డైరెక్టర్ ప్రొఫెసర్ ఎం.వీ. కార్తికేయన్ అన్నారు. వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలో 'వీఎల్‌ఎస్ఐ, సిగ్నల్ ప్రాసెసింగ్ అండ్ కమ్యూనికేషన్స్' అనే అంశంపై హైబ్రిడ్ మోడ్‌లో రెండ్రోజులపాటు నిర్వహిస్తున్న మూడవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్ శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. సదస్సులో ముందుగా మూడవ అంతర్జాతీయ కాన్ఫరెన్స్‌కు సంబంధించిన సిడిని ఆవిష్కరించారు. కార్యక్రమంలో అమెరికాలోని యూనివర్సిటీ ఆఫ్ మాల్టా ప్రొఫెసర్ లలిత్ గార్గ్, నార్వేలోని నార్వేవ్స్-6జీ వైస్‌ప్రెసిడెంట్ హేమంత్ జోషే, రాంచిలోని బిట్స్ పిలానీ మెస్రా క్యాంపస్ ఈసీఈ విభాగాధిపతి డాక్టర్ సంజయ్ కుమార్, ఆయా విభాగాల డీన్లు, విభాగాధిపతులు, అధ్యాపక సిబ్బంది, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి క్రీడలు దోహదం

ప్రజాశక్తి- గుంటూరు


క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న అడిషనల్ ఎస్పీ సుప్రజ

క్రీడలు కేవలం వినోదం కోసం మాత్రమే కాదని, అవి విద్యార్థుల వ్యక్తిత్వ వికాసానికి పునాది అని గుంటూరు క్రైమ్ బ్రాంచి అడిషనల్ ఎస్‌పి సుప్రజ అన్నారు. శుక్రవారం స్థానిక వికాస్ నగర్‌లోని వికాస్ గ్రౌండ్లో భాష్యం ఒలంపస్ పేరుతో మూడు రోజుల పాటు నిర్వహించనున్న జోనల్ లెవెల్ వార్షిక స్పోర్ట్స్‌మీట్ అట్టహాసంగా ప్రారంభించారు. అడిషనల్ ఎస్పీ సుప్రజ మాట్లాడుతూ నేటి విద్యార్థుల మనస్తత్వంలో ప్రస్తుతం రెండురకాల విపరీత ధోరణులు కనిపిస్తున్నాయని, కొందరు అతిగా పోటీ పడుతూ చిన్న ఓటమిని కూడా తట్టుకోలేకపోతుంటే, మరి కొందరు ఎందుకులే అన్నట్లు నిర్లిప్తంగా ఉంటున్నారన్నారు. ఈ రెండు ధోరణులు ప్రమాదకరమేనన్నారు. ఈరెండు అతివాద ధోరణుల మధ్య సమతుల్యత తీసుకురావడానికి క్రీడలే సరైన మార్గమన్నారు. క్రీడలు విద్యార్థుల్లో సహజంగానే క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తాయన్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చే పీఈటీ మాస్టర్లు, కోచ్‌లు ముందుగా క్రీడా స్ఫూర్తిని కలిగి ఉండి వారు వ్యక్తిగత ప్రతిష్టలకు పోకుండా, పిల్లలకు జట్టుగా ఎలా ఆడాలో, అందరితో ఎలా కలిసి ఉండాలో నేర్పించాలన్నారు. తల్లిదండ్రులు పిల్లలను ఎప్పుడూ చదువులోనే కాకుండా క్రీడల్లో కూడా ప్రోత్సహించాలన్నారు. తొలుత అడిషనల్ ఎస్పీ సుప్రజ భాష్యం స్పోర్ట్స్ మీట్ జెండాలను ఆవిష్కరించి క్రీడాజ్యోతిని వెలిగించి క్రీడలను ప్రారంభించారు. విద్యార్థులు నిర్వహించిన ఓపెన్ పరేడ్‌లో వారి నుండి గౌరవ వందనం స్వీకరించారు. అనంతరం జరిగిన క్రీడా పోటీల్లో భాష్యం సాంబశివపేట, ఆర్టీసీ కాలనీ, ఎస్‌విఎన్ కాలనీ, పట్టాభిపురం, నగరాలు బ్రాంచీలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. గెలుపొందిన విద్యార్థులకు అడిషనల్ ఎస్పీ సుప్రజ చేతుల మీదుగా బహుమతు లను అందజేశారు. కార్యక్రమంలో జెడ్‌ఈఓలు శివ, స్వప్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదవాలి


గ్లోబల్ సర్టిఫికెట్లు పొందిన విద్యార్థులు

ప్రజాశక్తి - గుంటూరు : విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకుంటే జీవిత గమ్యాన్ని సులభంగా చేరుకోగలమని విప్రో సంస్థ జనరల్ మేనేజర్ కె.ప్రవీణ్‌కమల్ అన్నారు. శుక్రవారం లాంలోని చలపతి ఇంజినీరింగ్ కాలేజిలో బిటెక్ విద్యార్థులకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సర్టిఫికెట్లు సాధించిన విద్యార్థులకు గ్లోబల్ సర్టిఫికెట్లు అందచేశారు. ఈ సందర్భంగా ప్రవీణ్‌కకమల్ మాట్లాడు తూ పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులు నైపుణ్యాలు పెంపొందిం చుకోవాలని అన్నారు. కళాశాల సెక్రెటరీ వై.సుజిత్‌కుమార్ మాట్లాడుతూ తమ కళాశాలలో ప్రణాళిక ప్రకారం ఉపాధి శిక్షణ, ఉపాధికి అవసరమైన అంతర్జాతీయ స్థాయి సర్టిఫికెట్ కోర్సులు నిర్వహిస్తున్నామని చెప్పారు. చలపతి విద్యాసంస్థల అధినేత డాక్టర్ వై.వి.ఆంజనేయులు మాట్లాడుతూ బి.టెక్ విద్యార్థులు మంచి ఉద్యోగాలు సాధించి జీవితంలో అగ్రస్థానం చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.చంద్రశేఖర్, ట్రైనింగ్ ప్లేస్‌మెంట్ ఆఫీసర్ రాకేష్‌కుమార్, డాక్టర్ ఎ.బాలాజీ, వెంకటరామారావు పాల్గొన్నారు.

అనుభవాలే అరుదైన పాఠాలు

ప్రజాశక్తి - గుంటూరు


మాట్లాడుతున్న సుభద్రాదేవి

జీవనసమరంలో ఎన్నో అనుభవాలు గడించిన పెద్దల నుంచి విలువైన పాఠాలు నేర్చుకోవచ్చుని ప్రముఖ సాహితీవేత్త శీలా సుభద్రాదేవి అన్నారు. తుళ్లూరు మండలం పెదపరిమిలో ముమ్వా చినబాపిరెడ్డి వఅద్దాలయంలోని పెద్దల సమక్షంలో సుభద్రాదేవి తన 76వ పుట్టినరోజు జరుపుకొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అరవై దాటగానే అంతా అయిపోయిందన్న నిరుత్సాహాన్ని దరిచేరనీయొద్దని, ప్రతిరోజూ తేలికైన వ్యాయామం చేయటం ద్వారా మనసును ఉల్లాసంగా ఉంచుకోవచ్చని చెప్పారు. వఅద్ధాలయం వఅద్ధులు మళ్ళీ జీవితంలో ఆరోగ్యాన్ని ఆనందాన్ని అందించేలా నిర్మాణం చేశారని మేనేజింగ్ ట్రస్టీ ఎన్.వి.రామిరెడ్డిని అభినందించారు. ట్రస్టీ రామిరెడ్డి మాట్లాడుతూ తన రచనల ద్వారా తెలుగు సాహిత్యాభిమానుల ఆదరాభిమానాలను చూరగొన్న సాహితీవేత్తగా మాత్రమే కాక, స్త్రీశక్తికి నిలువెత్తు నిదర్శనంలా నిలిచారని సుభద్రాదేవిని ప్రశంసించారు.కార్యక్రమంలో ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి మున్నంగి శ్రీనివాసరెడ్డి, ట్రస్టీలు వంగా సాంబిరెడ్డి, సీనియర్ సిటిజన్లు సుభద్ర దేవిని సత్కరించి, జ్ఞాపికలు అందజేశారు.

కళ్లంలో సంకల్ప్ వేడుకలు ప్రారంభం

ప్రజాశక్తి - గుంటూరు


వేడకల్లో పాల్గొన్న అతిథులు

కళ్లం ఇంజినీరింగ్ కాలేజిలో రెండ్రోజులపాటు జరిగే సంకల్ప్ - 2025 జాతీయస్థాయి విద్యార్థుల టెక్నికల్, మేనేజ్‌మెంట్ సదస్సు శుక్రవారం ఘనంగా ప్రారంభించారు. ఫోకస్ సాఫ్ట్‌నెట్ కంపెనీకి హెచ్‌ఆర్ విభాగాధిపతి కార్తికేయకుమార్ మాట్లాడుతూ ప్రస్తుత సాంకేతిక విప్లవాత్మక మార్పులకు అనుగుణంగా ప్రతి విద్యార్థి తమ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలన్నారు. సదస్సులో విద్యార్థులు వివిధ సాంకేతిక, మేనేజ్‌మెంట్ సంబంధిత అంశాలైన పేపర్, పోస్టర్ ప్రజంటేషన్, ప్రాజెక్ట్ ఎక్స్‌పో, బిజినెస్ క్విజ్, హ్యాకథాన్, ట్రెజరర్ హంట్ పోటీల్లో పాల్గొన్నారు. అలాగే సాంస్కృతిక, క్రీడా విభాగంలో వాలీబాల్, త్రోబాల్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు సంకల్ప్ నిర్వాహకులు డాక్టర్ ఎ.హనుమత్ ప్రసాద్ తెలిపారు. గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో కాలేజి చైర్మన్ కళ్లం మోహన్‌రెడ్డి, వైస్ ప్రెసిడెంట్ పి.వెంకటేశ్వరరెడ్డి, మేనేజ్‌మెంట్ ప్రతినిధులు కళ్లం భరద్వాజా, కాలేజి డైరెక్టర్ డాక్టర్ ఎం.ఉమాశంకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ బిఎస్‌బి రెడ్డి తదితరులుపాల్గొన్నారు.

మలినేని కాలేజిలో సెమీ క్రిస్మస్

ప్రజాశక్తి - గుంటూరు

పుల్లడిగుంటలోని మలినేని లక్ష్మయ్య మహిళా ఇంజినీరింగ్ కాలేజిలో శుక్రవారం సెమీక్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కళాశాల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్లు, ప్రిన్సిపాల్ డాక్టర్ జె.అప్పారావు, డైరెక్టర్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు, డీన్ డాక్టర్ కె.రమేష్‌బాబు, విద్యార్థులు పాల్గొన్నారు. పాస్టర్ రామకృష్ణ క్రిస్మస్ సందేశం ఇచ్చారు. చైర్మన్ మాట్లాడుతూ విద్యార్థులు సేవాభావాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం విద్యార్థులు ప్రదర్శించిన కరోల్స్, నాటికలు, సాంస్కృతిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి.



గెలుపొందిన విద్యార్థులు

వెయిట్ లిఫ్టింగ్ పోటీల్లో సెయింట్ ఆన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి - గుంటూరు

గోరంట్లలోని సెయింట్ ఆన్స్ మహిళా కాలేజిలో ఆచార్య నాగార్జునా యూనివర్సిటీ వారు ఇంట్రా కొలిగేట్ వెయిట్ లిఫ్టింగ్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కళాశాల విద్యార్థినులు ఎస్.మానస, బి.అమూల్య, ఎం.శ్రావణి, కె.భారతి, ఎస్.సాయిలీలమణి, వి.మహాలక్ష్మి దుర్గ, ఎన్.ప్రణతి, డి.లహరిప్రియ ప్రథమ, తృతీయ స్థానాల్లో బహుమతులు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ డాక్టర్ సిస్టర్ సంధ్య గెలుపొందిన విద్యార్థులను, ఫిజికల్ డైరెక్టర్ జి.బాలశౌరెడ్డి, అసిస్టెంట్ పీడీ కె.సుస్మిత, కోచ్ ఎండి.ఖమరుద్దీన్‌ను అభినందించారు.

బి ఫార్మసీ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి - ఏఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ పరిధిలో గత సెప్టెంబర్ లో జరిగిన బీఫార్మసీ 2వ సెమిస్టర్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు సీఈ ఆలపాటి శివప్రసాద్ తెలిపారు. రీ వ్యాల్యూషన్ కోసం ఈ నెల 30వ తేదీ లోపు ఒక్కొక్క పేపరుకు రూ.2070లు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు.


మాట్లాడుతున్న జస్టిస్ రఘునందనరావు

బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సెమీక్రిస్మస్

ప్రజాశక్తి - గుంటూరు లీగల్

గుంటూరు బార్ అసోసియేషన్‌లో సెమీక్రిస్మస్ వేడుకలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎపి హైకోర్టు న్యాయమూర్తి, జిల్లా పోర్ట్‌పోలియో జడ్జి జస్టిస్‌రావు రఘునందనరావు పాల్గొని మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ శాంతి, సమానత్వం, సోదర భావాన్ని అలవర్చుకోవాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.కళ్యాణ చక్రవర్తి ప్రసంగించారు. పాస్టర్ సుమన్ సుధ క్రీస్తు సందేశం ఇచ్చారు. కార్యక్రమంలో గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్షులు వై.శివసూర్యనారాయణ (బబ్లూ), బార్ అసోసియేషన్ కార్యవర్గ సభ్యులు, న్యాయవాదులు, నిర్వాహకులు పాల్గొన్నారు.